నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | గురువారం 20-2-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 176 | పేజీలు: 4 | వెల: రూ.1/-

యూపీలో ఘోరం
మహిళపై సామూహిక అత్యాచారం

లక్నో,ఫిబ్రవరి19(ఆర్ఎన్ఎ): ఎన్ని కఠినచట్టాలు వచ్చినా మహిళలపై అఘాయిత్యాలు ఆగడంలేదు. తాజాగా మధ్యప్రదేశ్ రాష్ట్రం కబీర్‌ధామ్ జిల్లాలోని టారెగావ్ అటవీ ప్రాంతంలో ఓ మహిళపై నలుగురు దుండగులు అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ ఘటనపై బాధితురాలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫిబ్రవరి 17న బాధిత మహిళ గ్రామస్థులతో కలిసి సమీపంలోని మావై గ్రామంలో జరుగుతున్న జాతరకు వెళ్లింది. తిరిగి గ్రామానికి వస్తున్న క్రమంలో సున్రేహా గ్రామం వద్ద నలుగురు వ్యక్తులు కారులో వచ్చి, తామూ అటువైపే వెళ్తున్నామని ఆమెను కారులో ఎక్కించుకున్నారు. ఆ తర్వాత దుండగులు గ్రామంవైపు కాకుండా సమీపంలో అటవీప్రాంతంలోకి తీసుకెళ్లి ఆమెపై అత్యాచారం చేశారు. బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదుతో స్పందించిన పోలీసులు 24 గంటల్లోనే నిందితులను గుర్తించి అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడైన ఆదిత్యతో పాటు మన్‌హరన్, రాజారాం, బోరందేవ్‌లపై ఐపీసీ సెక్షన్ 376, 36 కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సికింద్రాబాద్‌లో పిల్లవాడిని స్కూలుకు దింపేందుకు బైక్‌పై వెళతున్న వ్యక్తిని కారు ఢీకొనడంతో అక్కడిక్కడే మృతి చెందిన దృశ్యం

నగరంలో బీభత్సం సృష్టించిన కార్లు

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతి
మియాపూర్‌లో కారు బీభత్సంలో ఒకరు మృతి
సికింద్రాబాద్‌లో కారు ఢీకొని ఒకరు మృతి

హైదరాబాద్,ఫిబ్రవరి19(ఆర్ఎన్ఎ): నగరంలో కార్లు బీభత్సం సృష్టించాయి. వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతి చెందగా పలువురు గాయపడ్డారు. మియాపూర్‌లో కారు బీభత్సం సృష్టించింది. అతివేగంతో వెళ్తున్న కారు అదుపు తప్పి రెండు వాహనాలను ఢీకొట్టి హోటల్ లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో హోటల్‌లో ఉన్న వ్యక్తి ఒకరు అక్కడిక్కడే మృతి చెందాడు. మరో నలుగురికి గాయాలయ్యాయి. టూ వీలర్ వెహికిల్స్ పూర్తిగా ధ్వంసం అయ్యాయి. ఘటన స్థలానికి వచ్చిన పోలీసులు వారిని ఆస్పత్రికి తరలించారు. మృతి చెందిన వ్యక్తిని బీహెచ్ఈఎల్ కి చెందిన అఫ్జర్‌గా గుర్తించారు. మరో రెండు ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. కారు డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. డ్రైవర్ మద్యం మత్తులో ఉండటం వల్లే ప్రమాదం జరిగిందని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇకపోతే సికింద్రాబాద్ రైల్ నిలయం వద్ద ఇవాళ ఉదయం ఘోర రోడ్డుప్రమాదం సంభవించింది. స్కూల్లో తమ కుమారుడిని దింపేందుకు గిరి అనే వ్యక్తి బైక్‌పై వెళ్తున్నాడు. రైల్ నిలయం వద్దకు రాగానే గిరి బైక్‌ను ఓ కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తండ్రీకుమారుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గిరి మృతి చెందాడు. కుమారుడి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతుడి నివాసంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న కారు

నగరంలోని జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు సమీపంలో జరిగిన కారు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. ఆర్టీసీ బస్సును అతి వేగంగా వస్తున్న కారు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. బస్సు సికింద్రాబాద్ నుంచి కొండాపూర్ వెళ్తోంది. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు కారులో ఉన్న యువకులు మద్యం సేవించారా లేక అతివేగంతో వచ్చారా అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు.

ఆటోను ఢీకొట్టిన కారు పల్టీ

ఆటోను ఢీకొట్టి కారు పల్టీ కొట్టిన ఘటన హైదరాబాద్ నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు వద్ద జరిగింది. ప్రమాద సమయంలో ఆటోలో ఉన్న ఏడుగురు దినసరి కూలీలున్నారు. వారికి గాయాలయ్యాయి. దీంతో భారీగా ట్రాఫిక్ జాం అయింది. స్థానికుల సమచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణలో శివరాత్రి వైభవం

ముస్తాబైన పలు శివాలయాలు
ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
శివరాత్రికి విద్యుదీపాలంకరణలో ముస్తాబు
వేములవాడ, కాళేశ్వరంలలో ప్రత్యేక ఏర్పాట్లు

హైదరాబాద్,ఫిబ్రవరి19(నేటినిజం ప్రతినిది): శివరాత్రిని పురస్కరించుకుని తెలంగాణలోని ప్రముఖ శైవాలయాలు ముస్తాబయ్యాయి. అనేక ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రధానంగా వేములవాడ,కాళేశ్వరం, వేయిస్తంభాల గుడి, రామప్ప తదితర దేవాలయాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఏటా ఇక్కడ శివరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతాయి. అలాగే లక్షలాదిగా భక్తులు తరలివస్తారు. జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరాలయంలో ఈ నెల 20 నుంచి 22 వరకు జరిగే మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని కాళేశ్వరాలయం ముస్తాబయ్యింది. ప్రధాన గర్భగుడిని విద్యుత్ దీపాలతో అలంకరించారు. రంగురంగుల విద్యుత్ దీపాలతో కాళేశ్వరాలయం ముస్తాబు కావడంతో శివరాత్రి శోభను సంతరించుకుంది. మహాశివరాత్రి ఉత్సవాలకు వేములవాడ రాజన్న ఆలయం ముస్తాబయ్యింది. శనివారం వరకు మూడు రోజులపాటు నిర్వహించే జాతరకు సర్వం సిద్ధమవుతున్నది. ఇటు రాజన్న ఆలయాన్ని విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. విద్యుత్ కాంతులతో ఆలయ ప్రాంగణం మెరిసిపోతున్నది. ఈ యేడాది కూడా అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తున్నట్లు ఈవో కృష్ణవేణి వెల్లడించారు. చలువపందిళ్లు, తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేయనున్నారు. క్యూలైన్లో తాగునీరు సరఫరా చేయనున్నారు. ధర్మగుండంలో మంచినీటిని అందుబాటులోకి తెచ్చారు. దేవస్థానం ఆవరణలో సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు, వైర్‌లెస్ సెట్లతో అనునంధానం చేయనున్నారు. చెరువులోని మైదాన ప్రాంతంలో పార్కింగ్ స్థలం, శివార్చన కార్యక్రమం కోసం వేదిక, స్వాగత కమాన్ల పనులు శరవేగంగా చేస్తున్నారు. దేశంలో పేరుగాంచిన కళాకారులతో శివరాత్రి రోజున శివతాండవం, శివార్చన నృత్యరూపకాలు నిర్వహించనున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారి కోసం 300 బస్సులు అందుబాటులో ఉంటాయని, భక్తుల సౌకర్యార్థం ఆరుచోట్ల పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.. చెరువులోని మైదాన ప్రాంతంలో భక్తులకు తాత్కాలిక మరుగుదొడ్లు, మూత్రశాలలు, 20 నల్లాలను బిగించినట్లు చెప్పారు. జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలో వెలసిన శ్రీ సోమేశ్వర లక్ష్మీ నర్సింహస్వామి లింగము స్వయంభువు. ఆలయ గుహల నుంచిఓంకార ప్రణవనాదం వినిపిస్తుందని భక్తుల విశ్వాసం. అదృశ్య రూపంలో ఉన్న సిద్ధ పురుషులు అర్ధ రాత్రి వేళల్లో స్వామి వారిని అర్చించడానికి వస్తారని ప్రతీతి. ఈ క్షేత్రాన్ని సందర్శించిన వారికి లక్ష రెట్లు అధిక ఫలితంతో పాటు మోక్షం లభిస్తుందని నమ్మకం .పక్కనే మరొక గుహలో శ్రీ లక్ష్మీనర్సింహ స్వామి వెలసి శివ కేశవులకు భేదం లేదని ప్రభోదిస్తున్నాడు. ఈ శివ పంచాయతన క్షేత్రంలో శివుడు శ్రీ సోమేశ్వరుడిగా, విష్ణువు లక్ష్మీనర్సింహుడిగా వేర్వేరు గుహల్లో స్వయంభువులుగా వెలసి ఉన్నారు. ఇక్కడ శైవాగం, వైదికాగం ప్రకారంగా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. గిరిజనులు సంప్రదాయ బద్ధంగా నృత్యాలు చేస్తూ కోలాటాలతో ఎడ్ల బండ్లతో ప్రదర్శనగా రావడం జాతర ప్రత్యేకత. గ్రామంలో పంచగుళ్ల వద్ద ఉన్న కోనేరులో స్నానం చేసిన భక్తులు పంచగుళ్లు దర్శించుకుని సోమేశ్వర ఆలయానికి రావడానికి ఏర్పాట్లుచేశారు. పాలకుర్తిలోని శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాలకు ఆలయ అధికారులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. హరిహరులు స్వయంభువులుగా ఒకే గుట్టపై వెలసిన దివ్య క్షేత్రంగా పాలకుర్తి వెలుగొందుతుంది. ఏటా మహా శివరాత్రి సందర్భంగా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఈనెల 20 నుంచి 24 వరకు జరిగే బ్రహ్మోత్సవాలకు ఇతర జిల్లాల నుంచే కాకుండా పలు రాష్ట్రాల నుండి భక్తులు తరలి రానున్నారు. 21న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామి వారి కల్యాణం నిర్వహించనుండగా.. రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు దంపతులు పాల్గొని పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. భక్తుల కల్పతరువుగా, నమ్మిన వారి కొంగు బంగారంగా కురవిలోని వీరభద్రస్వామి విలసిల్లుతున్నాడు. తెలంగాణ రాష్ట్రంలోనే అత్యంత ప్రసిద్ధి గాంచిన శైవ పుణ్యక్షేత్రమైన భద్రకాళి సమేత శ్రీవీరభద్రస్వామి ఆలయంలో కల్యాణ బ్రహోత్సవాలు ఈనెల 20న గురువారం అంకురార్పణతో ప్రారంభం కానున్నాయి. ఈనెల 21వ తేదీన మహాశివరాత్రి పర్వదినోత్సవాన్ని పురస్కరించుకుని కల్యాణమహోత్సవం కన్నుల పండువగా జరగనుంది. ఈనెల 20వ తేదీ నుంచి మార్చి 6వ తేదీ వరకు శ్రీ స్వామివారి కల్యాణ బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

కురవిలోని భద్రకాళీ సమేత శ్రీవీర భద్రస్వామి కల్యాణ మహోత్సవ జాతరకు ఆలయ అధికారులు, వివిధ శాఖల అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. బుధవారం నాటికి ఏర్పాట్లు పూర్తికానున్నాయి.

ఆలయ ఆవరణలో చలువ పందిళ్లు ఏర్పాటుచేయగా... స్వామి కల్యాణ మహోత్సవం జరిగే నాగేంద్రస్వామి ఆలయ ఆవరణలో బారికేడ్లను ఆర్‌అండ్‌బీ అధికారులు నిర్మిస్తున్నారు. స్నాన ఘట్టాల వద్ద షవర్లు, తాత్కాలిక మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి కావొస్తున్నాయి. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం అబ్బాయిపాలెం శివారు కొండపై స్వయంభూగా వెలసిన అగస్తీశ్వర స్వామి మహిమాన్వితుడిగా భక్తులతో పూజలు అందుకుంటున్నాడు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 21, 22, 23వ తేదీల్లో నిర్వహించే మహాజాతర మహోత్సవానికి మూడు జిల్లాల నుంచి భక్తులు హాజరుకానుండగా.. నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఉమ్మడి జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రాల్లో ఒకటైన జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలోని కొడ్వటూరు గ్రామంలోని శ్రీ సిద్ధేశ్వర ఆలయం మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతోంది. బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. నేటి నుంచి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. తొలిరోజు గంగపూజ, ఋత్విక్‌కరణం, అవాహన దేవత పూజ, 20న ఏకదశరుద్రాభిషేకం, రుద్రహోమం, శతరుద్రాభిషేకం, 21వ తేదీన మహాశివరాత్రి పర్వదినాన శ్రీ భద్రకాశి వీరభద్రేశ్వరస్వామి ఆహ్వానం, రాత్రి శివపార్వతుల కల్యాణం, లింగోద్భవ పూజ ఉంటాయి. 22న ఉదయం అగ్నిగుండ ప్రవేశం, గెలుపు ఆశీర్వాదంతో ఈ బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. స్వామి కల్యాణానికి జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి దంపతులు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించనున్నారు. బ్రహ్మోత్సవాలకు తరలివచ్చే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేశారు.

సంప్రదాయ ఆహారమే ఆరోగ్యానికి రక్ష

నేషనల్ న్యూట్రిషన్ సంస్థను సందర్శించిన గవర్నర్

హైదరాబాద్,ఫిబ్రవరి19(ఆర్ఎన్ఎ): సంప్రదాయ ఆహారాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ అన్నారు. మన సంప్రదాయ ఆహారంలోనే పోషకాలు మెండుగా ఉన్నాయని ఆమె తెలిపారు. సంప్రదాయ ఆహారం తిన్న మన పూర్వీకులు ఎక్కువ కాలం జీవించారు అని గవర్నర్ గుర్తు చేశారు. తార్నాకలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్‌ను గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ సందర్శించారు. ఈ సందర్భంగా నేషనల్ న్యూట్రిషన్ సర్వేను గవర్నర్ ప్రారంభించారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ.. ఆరోగ్య భారత్ కోసం అనేక పోషకాహార పథకాలు అమల్లో ఉన్నాయని గవర్నర్ పేర్కొన్నారు. మనకు అందుబాటులో బలవర్ధక ఆహారంఉన్నా దాన్ని పట్టించుకోవడం లేదన్నారు. జంక్ ఫుడ్ వల్ల అనేక అనర్థాలు కలగడమే గాకుండా ఆరోగ్య సమస్యలు కూడా వస్తాయన్నారు. వివిధ రకాల జబ్బులకు సంబంధించి ఆహార అలవాట్లే కారణమని, న్యూట్రిషన్ ఇన్‌స్టిట్యూట్ తెలియచేస్తోందన్నారు. ప్రజలు సమజ ఆహార పదార్థాలను తీసుకుని ఆరోగ్యంగా ఉంటే వైద్యులకు దూరంగా ఉండవచ్చున్నారు. తమిళనాడులో కామరాజ్ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశ పెట్టారని అన్నారు. దీంతో పిల్లలకు పోషకకాహారం అందిందని అన్నారు. పిల్లల్లో మేధో శక్తికి ఇది దోహదపడిందన్నారు.

చిన్నపిల్లాడిపై దంపతుల దాష్టీకం

వీధిలో అల్లరి చేస్తున్నాడని చితకబాదిన జంట

హైదరాబాద్,ఫిబ్రవరి19(ఆర్ఎన్ఎ): సనత్‌నగర్‌లో దంపతులు వీరంగం సృష్టించారు. స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఓ విద్యార్థిపై ఆ దంపతులు దాడి చేశారు. రోడ్డుపై అల్లరి చేస్తున్నారంటూ ఓ విద్యార్థిని మహిళ పట్టుకుంది. ఆ బాలుడిని తీవ్రంగా కొట్టింది. తాను ఏం అల్లరి చేయలేదని బ్రతిమిలాడినా, కాళ్లు పట్టుకున్నా కూడా ఆ మహిళ కనికరించలేదు. ఆమె భర్త కూడా విద్యార్థిపై చేయి చేసుకున్నాడు. ఆ తర్వాత విద్యార్థులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు దంపతులు. లేబర్ పిల్లలు, చిల్లరగాళ్లు అంటూ ఆమె తిట్టింది. ఈ దృశ్యాలన్ని అక్కడున్న సీసీటీవీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు.. దంపతులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ప్రయాణంలోనే భారత సంస్కృతి కళ్లకు కట్టేలా ఏర్పాట్లు

ఆగ్రాలో రోడ్లను ముస్తాబు చేస్తున్న అధికారులు
తాజ్ వద్ద మొహబ్బుత్-ది తాజ్ వీక్షించనున్న ట్రంప్

ఆగ్రా,ఫిబ్రవరి19(ఆర్ఎన్ఎ): అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తొలిసారి భారత్‌కు రానున్న నేపథ్యంలో ఏర్పాట్లు జోరుగా కొనసాగుతున్నాయి. పర్యటనలో భాగంగా ఆయన ఢిల్లీ, అహ్మదాబాద్‌తో పాటు ఆగ్రాలోని తాజ్‌మహల్‌ను కూడా సందర్శించనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం భారీ ఏర్పాట్లకు శ్రీకారం చుట్టింది. తాజ్ వరకు సాగే దాదాపు 12 నిమిషాల ప్రయాణంలో భారత సంస్కృతి ట్రంప్ కళ్లకు కట్టేట్లు చూపేందుకు యత్నిస్తున్నారు. అందులో భాగంగా రోడ్డుకిరువైపులా ఉండే గోడలను భారత సంస్కృతీ సాంప్రదాయాలకు అద్దం పట్టే పెయింటింగ్స్ వేయిస్తున్నారు. అలాగే ప్రధాన కూడళ్ల వద్ద సాంస్కృతిక నృత్యాలు నిర్వహించనున్నారు. అందుకోసం దాదాపు 3000 మంది సంప్రదాయ నృత్యకారులను సమాయత్తం చేస్తున్నట్లు సమాచారం. అక్కడక్కడా ఉండే ప్రముఖుల విగ్రహాలను కూడా సర్వాంగసుందరంగా తీర్చిదిద్దుతున్నారు. తాజ్ వద్ద నిర్వహించే 'మొహబ్బుత్-ది తాజ్' అనే సాంస్కృతిక ప్రదర్శనను కూడా ట్రంప్ వీక్షించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ఇప్పటికే వేలాది మంది కార్మికులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. రోడ్లు, డివైడర్లు, గోడలను శుభ్రం చేసే పనిలో పడ్డారు. స్థానికంగా లభిస్తున్న ప్రముఖ చిత్రాకారులనంతా ప్రభుత్వం రంగంలోకి దింపింది. వీరంతా భారత్-అమెరికా బంధానికి అద్దం పట్టే చిత్రాల్ని గోడలపై చిత్రిస్తున్నారు. మోదీ, ట్రంప్ మైత్రిని హైలైట్ చేస్తూ వారివురు కలిసున్న చిత్రాలను గోడలపై గీస్తున్నారు.

భద్రతా ఏర్పాట్లను కూడా యోగి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఎన్ఎస్‌జీ, ఏటీఎస్ కమాండోలు సహా దాదాపు 6000 మంది భద్రతా బలగాల్ని రంగంలోకి దింపింది. ఇప్పటికే వీరంతా ఆయా ప్రాంతాల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. జనవరిలో అమెరికాకు చెందిన అడ్వాన్స్‌డ్ సెక్యూరిటీ 40 మంది సభ్యుల బృందం తాజ్ ప్రాంతాన్ని సందర్శించింది. భద్రతా పరమైన ఏర్పాట్లను పరిశీలించింది. ఆ తర్వాతే ట్రంప్ తాజ్ సందర్శన ఖాయమైంది. సోమవారం కూడా స్థానిక పోలీసులతో కలిసి అమెరికాకు చెందిన మరో బృందం భద్రతాపరమైన ఏర్పాట్లను తనిఖీ చేసింది. గతంలో ఒబామా చివరి నిమిషంలో తన తాజ్ సందర్శనను రద్దు చేసుకున్న విషయం తెలిసిందే. ట్రంప్ పర్యటన నేపథ్యంలో యూపీ ప్రభుత్వం యమునా నదికి 500 క్యూసెక్కుల నీటిని వదిలింది. బులంద్‌శహర్‌లోని గంగానహర్ కెనాల్ నుంచి నీటిని విడుదల చేసింది. తద్వారా మురుగు వాసన, చెత్త చెదారం తొలగిపోతుందని భావిస్తున్నారు. దీంతో ఆగ్రా ప్రాంతంలో యమునా నది కాలుష్యం తగ్గుతుందని అధికారులు తెలిపారు.

ముగిసిన హైదరాబాద్ ఎగ్జిబిషన్

20 లక్షల 20 వేల మంది సందర్శన
చివరిరోజు 60 వేల మంది సందర్శకులు

హైదరాబాద్,ఫిబ్రవరి19(ఆర్ఎన్ఎ): నగర వాసుల మదిదోచే ఎగ్జిబిషన్‌గా పేరొందిన అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన నుమాయిష్ మంగళవారం రాత్రి ముగిసింది. ఈ నెల 14 వరకే అనుమతించినా చివరలో మరో నాలుగు రోజులు పొడిగించి 18 వరకు నడిపారు. నాంపల్లి ఎగ్జిబిష్ మైదానంలో 80వ అఖిలభారత పారిశ్రామిక ప్రదర్శన జనవరి 1వ తేదీన ప్రారంభమై 18న మంగళవారం ముగిసింది. గతేడాది అగ్నిప్రమాదంకారణంగా ఈ యేడు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. ప్రధానంగా ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. 49 రోజులపాటు కొనసాగిన ఎగ్జిబిషన్‌ను 20 లక్షల 20 వేల మంది సందర్శించారని ఎగ్జిబిషన్ సొసైటీ కార్యదర్శి ప్రభాశంకర్, కోశాధికారి వినయ్‌కుమార్ ముదిరాజ్‌లు వెల్లడించారు. చివరిరోజు మంగళవారం దాదాపు 60 వేల మంది ఎగ్జిబిషన్‌కు తరలివచ్చారన్నారు. 17వ తేదీ సోమవారం వరకు 19 లక్షల 60 వేల మంది సందర్శకులు సందర్శించగా మంగళవారం 60 వేల మంది సందర్శకులతో కలిసి మొత్తం 20 లక్షల 20 వేల మంది ఎగ్జిబిషన్‌ను సందర్శించడం రికార్డు అని వారన్నారు. ఎగ్జిబిషన్ ప్రశాంతంగా జరిగేందుకు సహకరించిన పోలీసు, రెవెన్యూ, ఫైర్, జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీస్, ఇతర శాఖల అధికారులు, సిబ్బందికి ప్రభాశంకర్, వినయ్‌కుమార్ ముదిరాజ్ కృతజ్ఞతలు తెలిపారు. 49 రోజులపాటు కొనసాగిన ఎగ్జిబిషన్‌ను దాదాపు 20 లక్షల మంది సందర్శించారు. నగరంతోపాటు దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన ఉత్పత్తులు ఇక్కడ విక్రయించారు. చివరి రోజు మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి కొనుగోళ్లు జరిపారు. జ్యువెలరీ, దుస్తులు, పాదరక్షలు, డ్రైఫ్రూట్స్, గృహోపకరణాలు, ఫుడ్ స్టాల్స్ వద్ద జనం కిక్కిరిసి కన్పించారు.

ఎసిబికి చిక్కిన బిల్‌కలెక్టర్

మేడ్చల్,ఫిబ్రవరి18(ఆర్ఎన్ఎ): అవినీతికి పాల్పడుతూ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా పోచారం మున్సిపాలిటీ బిల్ కలెక్టర్ ఏసీబీ అధికారులకు చిక్కాడు. బిల్ కలెక్టర్ కుమారస్వామి రూ.10 వేలు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధకశాఖ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుపడ్డాడు. ఇళ్లు గ్రామకంఠం పరిధిలో లేదని తెలియజేసే ఎన్ఓసీ మంజూరుకు బిల్ కలెక్టర్ లంచం డిమాండ్ చేసినట్లుగా సమాచారం.

సుప్రీం తీర్పు చారిత్రాత్మకం

-మహిళలకు కమాండ్ హోదాపై శివసేన హర్షం

ముంబయి,ఫిబ్రవరి19(ఆర్ఎన్ఎ): సైనిక దళాల్లో లింగ వివక్షకు ముగింపు పలుకుతూ సైన్యంలో మహిళా అధికారులకు 'కమాండ్ హోదా' ఇచ్చేలా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై శివసేన హర్షం వ్యక్తం చేసింది. సుప్రీం నిర్ణయం చరిత్రాత్మకమని కొనియాడింది. ఇదే సమయంలో మహిళా అధికారులకు కమాండ్ హోదా ఇవ్వడాన్ని వ్యతిరేకించిన కేంద్ర ప్రభుత్వంపై విమర్శల వర్షం కురిపించింది. మహిళా ప్రధాని ఇందిరాగాంధీ హయాంలో 1971లో పాకిస్థాన్‌పై మనం యుద్ధం గెలిచామన్న విషయాన్ని మరిచారా అంటూ ఎద్దేవా చేసింది. ఈ మేరకు తమ అధికారిక పత్రిక సామ్నా సంపాదకీయంలో రాసుకొచ్చింది.

సుప్రీం తీర్పుతో కేంద్రం షాక్‌కు గురైంది. శారీరక పరమైన పరిమితుల కారణంగా మహిళలకు కమాండ్ హోదా ఇవ్వట్లేదని ప్రభుత్వం చెప్పింది. అంతేగాక అలాంటి కఠినమైన విధులు మహిళలు నిర్వర్తించగలరా లేదా అని అనుమానించింది. 'ప్రగతి గురించి మాట్లాడే ప్రభుత్వం నిజమైన వైఖరి ఇదే' అని శివసేన విమర్శించింది. ఇలాంటి మూస ఆలోచనా ధోరణిని ప్రభుత్వం మార్చుకోవాల్సిన అవసరం ఉందని సూచించింది.

మహిళ అయిన ఇందిరాగాంధీ ఈ దేశానికి ప్రధాని అయ్యారని, ఆమె నాయకత్వంలో 1971లో పాక్‌పై భారత్ యుద్ధం గెలిచిన విషయాన్ని గుర్తుచేసింది. శౌర్యం, త్యాగం విషయంలో మహిళ, పురుషుడు అనే భేదభావం చూపించడం ఎంతమాత్రం సరికాదని హితవు పలికింది. సాయుధ బలగాలకు మహిళ అధినాయకత్వం వహించే రోజు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేసింది.

సైన్యంలో మహిళా అధికారులకు మూడు నెలల్లోగా శాశ్వత కమిషన్ మంజూరు చేయాలని సుప్రీంకోర్టు గత సోమవారం కేంద్రాన్ని ఆదేశించిన విషయం తెలిసిందే. శారీరక పరిమితుల కారణంగా మహిళలకు కమాండ్ హోదా ఇవ్వడం లేదన్న ప్రభుత్వ వాదనను న్యాయస్థానం తీవ్రంగా తప్పబట్టింది. 'గర్భధారణ, మాతృత్వాన్ని పొందడం, పిల్లల పెంపకం, కుటుంబపరమైన బాధ్యతల నిర్వహణ వంటి కారణాల వల్ల మహిళా అధికారులు సైనిక విధుల్లోని సవాళ్లను అందుకోలేరన్న కేంద్ర ప్రభుత్వ వాదన మూస ఆలోచన ధోరణికి నిదర్శనం. ఇది రాజ్యాంగపరంగా చెల్లుబాటు కాదు' అని సుప్రీంకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది.

సూడాన్ మహిళ నుంచి బంగారం స్వాధీనం

హైదరాబాద్,ఫిబ్రవరి19(ఆర్ఎన్ఎ): శంషాబాద్ ఎయిర్‌పోర్టులో సూడాన్ దేశస్థురాలి నుంచి కస్టమ్స్ అధికారులు బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. దుబాయ్ నుంచి హైదరాబాద్ వచ్చిన సూడాన్ మహిళ వద్ద 233.2 గ్రాముల బంగారాన్ని సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ బంగారం విలువ రూ. 11 లక్షలు ఉంటుందని అధికారులు వెల్లడించారు. నిందితురాలు బంగారాన్ని వివిధ రకాలైన ఆభరణాల రూపంలో తయారు చేసి బూట్లలో...లోదుస్తుల్లో దాచి తరలిస్తుండగా పట్టుబడింది. పట్టుబడ్డ బంగారం విలువ రూ. 11 లక్షలు ఉంటుందని అధికారులు వెల్లడించారు. మహిళను అధికారులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రైళ్లలో చోరీ చేస్తున్న హోంగార్డు అరెస్ట్

హైదరాబాద్,ఫిబ్రవరి19(ఆర్ఎన్ఎ): రైళ్లలో చోరీలు చేస్తున్న హోంగార్డును రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మహారాష్ట్రకు చెందిన హోంగార్డు మోహన్‌ను రైల్వే పోలీసులు బాసర వద్ద అరెస్ట్ చేశారు. పోలీసులు నిందితుడు మోహన్ వద్ద నుంచి 11 తులాల బంగారం, రూ. 1.50 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీసులకు రివార్డు మేళా నిర్వహించి సర్టిఫికెట్లు అందచేసిన కమిషనర్ సజ్జన్నార్.

చరిత్రలో నేటినిజం

కం॥ ఆ చ్ఛోదన మొనరించుచు
నా చ్ఛాదనకై పెదుకక నమితబలుండై
మ్లేచ్ఛులపై పోరాడుచు
స్వేచ్ఛా మాయువులనింపె వీరశివాజీ॥

-రాధశ్రీ
సెల్: 9494481210

(ఫిబ్రవరి 19 ఛత్రపతి శివాజీ జయంతి)

ఆచరించి అమలు చేసేదెవరు? ..!

నేటినిజం
గురువారం 20-2-2020

జ్ఞానం అనేది కాంతి లాంటిది. గుడిలో దీపం ఎంతగా అందాన్ని ఇస్తుందో మనిషికి విద్య కూడా అంతే! విద్యను కానీ, విద్యావ్యవస్థలను కానీ కించపరిస్తే, బలహీనపరిస్తే దీర్ఘకాలంలో మొత్తం సమాజమే ధర్మాన్ని కోల్పోతుంది. అధర్మంవైపే అడుగులు వేస్తుంది. వీధికో పాఠశాల, మండలాల్లో జూనియర్ కళాశాలలు, డిగ్రీకాలేజీలను ఇరుకు భవనాల్లో ఏర్పాటు చేస్తున్నారు. సువిశాల ప్రాంగణాల్లో రూపుదిద్దుకోవాల్సిన విశ్వవిద్యాలయాలు చిన్న చిన్న భవనాల్లో సర్దుకుపోతున్నాయి. దేశంలో విద్యావ్యవస్థల దురవస్థ ఇది. పెద్ద పెద్ద డిగ్రీలు(పిజి) పొందినవారు నేరుగా ఉపాధిని పొందలేకపోతున్నారు. విద్యారంగం పూర్తిగా వ్యాపారమైపోయింది. పగ్గాలు పైరవీకారుల హస్తగతమయ్యాయి. సేవాభావంతో పనిచేసే సంస్థలు మచ్చుకైనా కానరావడంలేదు. అంతా విద్యావిధానంలో లోపాలను ఎత్తిచూపడానికి ప్రయత్నించేవారే. వాటిని సరిదిద్దేవారే కరువైపోయారు. దిద్దుబాటు చర్యల గురించి పాలకులే పట్టించుకోకపోతే ఇక ఆచరించి అమలు చేసేదెవరు? ఇలాంటి పరిస్థితుల్లో దేశంలో విద్యారంగం అనాథ కాక ఏమవుతుంది? దేశంలో ఒకనాడు విద్యాబోధన పవిత్ర వృత్తి. నేడు ఇది పక్కా వ్యాపారంగా మారిపోయింది. ప్రాథమిక స్థాయి నుండి విశ్వవిద్యాలయం స్థాయి వరకు కోట్లమంది విద్యార్థులే వినియోగదారులు. మొత్తంగా విద్యారంగం దేశంలోనే పెద్ద పరిశ్రమగా రూపుదాల్చింది. పరిశ్రమల్లో వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తుల నాణ్యతను పెంపొందిస్తుంటారు. తరాలు మారినా, విజ్ఞానం పెరిగినా మన చదువులు తాతల కాలం నాటివే. ప్రతి ఏడాది లక్షల సంఖ్యలో పట్టభద్రులను ఉత్పత్తి చేస్తూ పోవడమే తప్ప ఆయా పట్టాల విలువను, నాణ్యతను కాపాడి పెంపొందించాలన్న ధ్యాస చదువుల పరిశ్రమకు లేదు. అయితే ఉన్నత విద్యకు యువత నైపుణ్యాలు ఎందుకూ కొరకాకుండా పోతాయి. భవిష్యత్ యువ భారతదేశానిదేనన్న అంచనాల నేపథ్యంలో ప్రస్తుత పరిస్థితి మన దేశానికి ప్రమాద ఘంటికే. 2020 నాటికి భారతదేశంలో 20 నుంచి 24 ఏళ్ళ లోపున్న వారి సంఖ్య చైనాకంటే ఎక్కువగా ఉంటుందన్న అంచనా. అంది వస్తున్న ఈ అవకాశాన్ని మన పాలకులు సుశిక్షితులుగా తీర్చిదిద్దుకోవాలి. యువశక్తికి నాణ్యమైన విద్య అందించి దేశాభివృద్ధికి వినియోగించుకోవాలి. దేశంలో ఉన్నత విద్య అనేక రుగ్మతలతో సతమతమవుతోంది. పలితంగా ఉన్నత విద్యాసంస్థల్లో ప్రవేశాలు అతి తక్కువ స్థాయిలో ఉంటున్నాయి. ఉన్నత విద్యాధికుల సంఖ్య పెంచుకోవడానికి అసమానతలను అధిగమించాల్సి ఉంటుంది. సామాజిక సమస్యలు, ఆడ, మగ విచక్షణ, పట్టణ, గ్రామీణ తారతమ్యాల వంటి వాటిని తగ్గించడానికి ప్రయత్నించాల్సి ఉంటుంది. ముఖ్యంగా రాష్ట్ర నిధులతో విద్యాసంస్థలను ముందుగా ఆదుకోవాలి. వాటిలో సదుపాయాలను మెరుగు పరచాలి. బోధన స్థాయి పెంపుదలకు చర్యలు చేపట్టాలి. ఇలాంటి పరిస్థితులు లేనందున రాష్ట్రాల్లోని ఉన్నత విద్యాసంస్థల్లో స్థాయికి తగిన బోధన స్థాయి తగ్గిన పరిశోధనలు కనిపిస్తున్నాయి. చదువులన్నీ పరిశ్రమల్లా మారిపోతున్న ఈ రోజుల్లో రాను రాను విద్యార్థులు ఎంత సంపాదించాలో అనేది ప్రశ్నే మరి!

కంప్యూటర్ టీచర్ లేక మూలన పడ్డ బోధన

-వృధాగా మూలుగుతున్న కంప్యూటర్లు

ఆదిలాబాద్,ఫిబ్రవరి19(ఆర్ఎన్ఎ): లక్షలు వెచ్చించి పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పొందాలని భావించి మంజూరు చేసి న కంప్యూటర్లు అలంకార ప్రాయంగా మారడంతో కంప్యూటర్ విద్య మిథ్య గా మారింది. ఉట్నూర్ ఏజెన్సీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను కొన్నింటిని 2005లో ప్రభుత్వం ఎంపిక చేసి లక్షలాది రూపాయలు విలువగల కంప్యూటర్లను మంజూరు చేసింది. కాని వాటిని ఉపయోగించుకోవడానికి సిబ్బందిని నియమించక పోవడంతో లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన కంప్యూటర్లు తుప్పు పడుతున్నాయి. జిల్లాపరిషత్ సెకండరీ పాఠశాల లో 8,9,10 తరగతుల్లో విద్యార్థులకు గత ఐదేళ్ల నుంచి కంప్యూటర్ బోధన దూరమయ్యింది. విద్య నేర్పించడానికి ఉపాధ్యాయులు లేక కంప్యూటర్ విద్య నిలిచిపోయింది. గతంలో జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలల్లో కంప్యూటర్ విద్య బోధించడానికి స్వచ్ఛంద సంస్థ ఉపాధ్యాయులను నియమించడంతో కంప్యూటర్ విద్య కొనసాగింది. స్వచ్ఛంద సంస్థ దూరం కావడంతో ఉపాధ్యాయులు లేక కంప్యూటర్ విద్య కొనసాగడం లేదు. కాల్‌సెంటర్ పథకం ద్వారా కేజీబీవీ, పెర్కగూడెం, హస్నాపూర్ ఉన్నత పాఠశాలలతో పాటు ఉట్నూర్‌లోని యూపీఎస్ పాఠశాలల్లో కూడ కంప్యూటర్లు పని చేయడం లేదని ఎంసిహో తెలిపారు. ఉట్నూర్ మండలంలో పదేళ్లక్రితం సెకండరి పాఠశాలల్లో 8, 9, 10 తరగతులు చదువుకుంటున్న విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం కల్పించాలని కంప్యూటర్లు ఏర్పాటు చేసారు. ఓ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కంప్యూటర్ టీచర్‌ను ఏర్పాటు చేసి గౌరవ వేతనం చెల్లించి ఐదేళ్ల పాటు నడిపించారు. కంప్యూటర్ టీచర్లు ఉన్నన్ని రోజులు పాఠశాలల్లో కంప్యూటర్ బోధన జరిగింది. ఆ సంస్థ బాధ్యతల నుంచి తప్పుకోవడంతో కంప్యూటర్లు మూలనపడి నిరుపయోగంగా మారాయి. కేజీబీవీలకు కాల్‌సెంటర్ కార్యక్రమం ద్వారా రాజీవ్ విద్యామిషన్ పథకం కింద మూడేసి కంప్యూటర్లను పాఠశాలలకు పంపించి ఫర్నీచర్‌ను కూడ అందించారు. కాని కంప్యూటర్ టీచర్లను నియమించక పోవడంతో కంప్యూటర్లు పనిచేయడంలేదు. ఫలితంగా ప్రభుత్వ ఆశయం నీరు గారింది.

బొగ్గు ఉత్పత్తిపైనే అధికారుల శ్రద్ధ

కార్మికుల ఆరోగ్యాలపై చిత్తశుద్ధి లోపం

కాలనీల్లో పారిశుద్ధ్య నివారణలో నిర్లక్ష్యంపై ఆగ్రహం

కొత్తడూడెం,ఫిబ్రవరి19(ఆర్ఎన్ఎ): సింగరేణి అధికారులకు బొగ్గు ఉత్పత్తిపై ఉన్న శ్రద్ధ కార్మికుల సంక్షేమంపై ఎంత మాత్రం లేదని కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.ఏరియా జనరల్ మేనేజర్ మొదలుకొని అక్కడ పనిచేసే సూపర్‌వైజర్ల వరకు ఎవరూ పట్టించుకున్న దాఖలాలు కనిపించడంలేదని కార్మిక కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. సింగరేణి బొగ్గుగని కార్మిక వాడలకు ప్రధాన కేంద్రమైన రామవరం పట్టణంలో పారిశుధ్యం పనులు పూర్తిగా పడకేశాయి. ఆ ఏరియాలో ఉన్న వివిధ బస్తీల్లో ఎక్కడి చెత్త కుప్పలు అక్కడే పేరుకుపోయాయి. చెత్తకుండీల్లో ఉన్న చెత్త కిందపడి కాల్వలు జామ్ అయి దుర్గంధం వెదజల్లుతున్నాయి. ఏరియాలో ఎక్కడ చూసినా చెత్త కుప్పలు, మురుగు వాసన దర్శనమిస్తోంది. ఈ వ్యవహారం పట్ల సింగరేణి కార్మికులు, వారి కుటుంబ సభ్యులు తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. పారిశుధ్య పనులు సక్రమంగా సాగడంలేదని అక్కడి జనాలు అనారోగ్యాల పాలవుతున్నారని ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడంలేదని కార్మికులు, వారి కుటుంబాలు ఆరోపిస్తున్నాయి. వీధుల్లో విపరీతమైన చెత్త పేరుకుపోయింది. కుండీల్లో ఉన్న చెత్తను పందులు, కుక్కలు బయటికి తోడటం వల్ల అది కాల్వలో పడి వీధుల వెంట మురుగు నీరు ప్రవహిస్తోంది. దీనిపై రామవరం సింగరేణి సివిల్ విభాగానికి చెందిన సూపర్ వైజర్లు కానీ, కాంట్రాక్టర్ కానీ ఏమాత్రం పట్టించుకోవడంలేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీఎం కార్యాలయానికి చెందిన అధికారులకు సైతం విన్నవించుకున్నా వారిలో స్పందన కనిపించడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సివిల్ విభాగం వారు నిర్వహించే తాగునీటి వ్యవహారం కూడా అస్తవ్యస్థంగానే ఉందని ఆరోపణలున్నాయి. అయినా ఏరియాకు చెందిన ఉన్నతాధికారులు ఏనాడూ పట్టించుకున్న పాపానపోలేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. విషయం ఏరియా యాజమాన్యానికి తెలిసినా దీనిపట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని కార్మికులు తప్పు పడుతున్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ఈ విభాగం పూర్తిగా విఫలమైనట్లు కార్మికులు, కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

అనధికార మతకట్టడాలు ఇక సాగవు..!!

-సమీక్ష సమావేశంలో మాట్లాడిన జిల్లా అదనపు కలెక్టర్ వీరారెడ్డి.

సంగారెడ్డి ఫిబ్రవరి 19 (నేటినిజం ప్రతినిధి) .అనుమతులు తీసుకోకుండా మతపరమైన కట్టడాలను చేప్పట్టిన వారిపై చట్ట ప్రకారము కఠిన చర్యలు తీసుకుంటామని సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ వీరారెడ్డి తెలిపారు ..

మంగళవారం కలెక్టరేట్ లో ని మినీ సమావేశమందిరములో జిల్లా స్థాయి కమిటీ సమీక్ష సమావేశము లో అదనపు కలెక్టర్ వీరారెడ్డి మాట్లాడుతూ సుప్రీం కోర్ట్ వారి ఆదేశాల ప్రకారము జి.ఓ .నెంబర్ 262 ,263 ,బహిరంగ ప్రదేశాలు మరియు ఉద్యానవనాలలో బహిరంగ వీధులు మరియు ఇతర ప్రదేశాలలో అనధికార మత నిర్మాణాలు జరపకూడదు అని తెలిపారు .

జిల్లా లో ప్రభుత్వా అనుమతులు లేకుండా కట్టిన మతపరమైన కట్టడాలకు సంబందించి వారిపై తగినా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

మున్సిపాలిటీ లో అధికారులు అందరూ నిత్యము తపరమైన అనధికార కట్టడాలను రోజు పర్యవేక్షిస్తుండాలి అన్నారు .

ప్రభత్వ స్థలంలో నోటీసు బోర్డు లు ఎరపాటు చేయాలి అవసరమైనా చోట సి సి కెమెరాలను వాడాలని, మున్సిపాలిటీ లో పార్క్ లను అభివృద్ధి చేయాలని అన్నారు.మున్సిపాలిటీ లోని లే ఔట్స్ అనుమతులు ఇచ్చిన తరువాత తప్పని సరిగా అవే నిర్మాణలు చేపట్టాలని వాటిలో ఎటువంటి మార్పులు చేసిన అధికారుల అనుమతులు తప్పని సరిగా తీసుకొనవలెనన్నారు . ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాల్సిన భాద్యత అధికారుల పై ఉందన్నారు.ఈ సమీక్షా సమావేశంలో అడిషనల్ ఎస్ .పి .కే.సృజన ,ఆర్ .డి .ఓ .నగేష్ ,అసిస్టెంట్ కమిషనర్ దేవాదాయ శాఖ హేమంత్ కుమార్ ,తదితరులు పాలొగొన్నారు

పట్టాలెక్కనున్న పట్టణ ప్రగతి

హైదరాబాద్, ఫిబ్రవరి 19:రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో అభివృద్ధి, పచ్చదనం, పరిశుభ్రత వెల్లివిరిసేలా చేసేందుకు పల్లెప్రగతి కార్యక్రమం చేపట్టి విజయవంతంచేసింది. ఇప్పుడుఅదే తరహాలో పట్టణ ప్రణాళిక అమలు చేయబోతున్నారు. సిఎం కెసిఆర్ ఈ మేరకు అధికారులు, ప్రజాప్రతినిధులతో చర్చించి, స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. దీంతో 24 నుంచి పట్టణ ప్రగతి సాగనుంది. ఇప్పటికే రెండు విడతలుగా పల్లె ప్రణాళిక ప్రకారం పనులు చేసి.. శాశ్వతంగా గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గ్రామాల కంటే ఎక్కువ ఆదాయం, ఎక్కువ నిధులు ఉండే మున్సిపాలిటీల్లో అటు ప్రజాప్రతినిధులు, ఇటు అధికారులు అనుకుంటే పట్టణాలు స్వచ్ఛతను సంతరించుకుంటాయని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. పల్లెల్లో ఇప్పటికే ఇందులో భాగంగా డంపింగ్‌యార్డులు, ఇంకుడు గుంతలు, శ్మశాన వాటికలు, డ్రెయినేజీలు శుభ్రం చేయడం, విద్యుత్ సమస్యలను పరిష్కరించడం, శిథిల భవనాలను కూల్చివేయడం, పాత బావులను పూడ్చివేయడం వంటి పనులు చేపట్టడంతో ప్రస్తుతం గ్రామాలు సుందరంగా తయారవుతున్నాయి. పల్లెల మాదిరిగానే పట్టణాలను అభివృద్ధి చేసేందుకు పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఈ నెల 24వ తేదీ నుంచి పదిరోజులు పాటు కార్యక్రమాన్ని నిర్వహించ నున్నారు. అయితే పల్లె ప్రగతి మొదటి విడత ముగిసిన సమయంలోనే జిల్లా అధికారులు పట్టణ ప్రణాళిక కార్యక్రమాన్ని చేపట్టారు. అప్పట్లో పాలకవర్గాలు లేకపోవడం, ప్రత్యేక అధికారుల పాలన ఉండటంతో కార్యక్రమం ఆశించినంతంగా విజయవంతం కాలేదు. ఖాళీ స్థలాలు శుభ్రం చేయడం, డ్రెయినేజీలు తీయించడం లాంటి కొన్ని పనులు మాత్రమే చేపట్టగలిగారు. తర్వాత మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ రావడం.. చకచక ఎన్నికలు ముగిసి.. పాలకవర్గాలు కొలువు దీరడంతో ఇప్పుడు పట్టణ ప్రణాళిక చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఏ ఒక్క మున్సిపాలిటీలోనూ ప్రజలు విధిగా డస్ట్‌బిన్‌లలోనే చెత్త వేసుకుని.. చెత్తబండి వచ్చినప్పుడు అందులో వేయడం లేదు.. ఎప్పటి చెత్త అప్పుడే చుట్టుపక్కల ఉండే ఖాళీ ప్లాట్లలో వేస్తున్నారు. ప్రజలు తాము చెత్త ట్రాక్టర్లలో వేయడానికి సిద్ధమని.. అయితే అవి ఎప్పుడు వస్తాయో.. ఎప్పుడు రావో తెలియని పరిస్థితి ఉందని, అందుకే ఖాళీ స్థలాల్లో వేయాల్సి వస్తుందని అంటున్నారు. ప్రతిరోజూ ప్రతీ గల్లీకి చెత్తబండి తిరిగేలా ఏర్పాట్లు చేయాలన ఇప్రజలు కోరుకుంటున్నారు. మున్సిపాలిటీకి ఇంకా అవసరమైన మేరకు ట్రాక్టర్లు కొనుగోలు చేయాలి. మినీ ట్రాలీలు, చెత్తరిక్షాలు సైతం సిద్ధం చేసుకోవాలి. ప్రతీ వార్డుకు కౌన్సిలర్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలి. అలాగే పల్లెల్లో మాదిరిగానే మున్సిపాలిటీల్లో పనిచేసే పారిశుధ్య కార్మికుల వేతనాలు పెంచడంతోపాటు, వారి సంఖ్యనూ పెంచాలి. ఎప్పటికప్పుడు వారికి జీతాలు టంఛనుగా వచ్చే ఏర్పాటు చేయాలి. సానిటేషన్ విభాగం అధికారులు.. ప్రజాప్రతినిధులు సమస్యలు తెచ్చినప్పుడే కాకుండా మిగతా సమయాల్లోనూ వార్డుల పర్యటన చేయాలి. గతంలో మాదిరిగా చెత్త బండికి స్పీకర్ ఏర్పాటు చేసి.. వార్డుల్లో తిప్పాలి. అలాంట ప్పుడే ఇళ్లలో ఉండే వారికి బండి వచ్చిన విషయం తెలిసి వచ్చి చెత్త వేస్తారు. ఎక్కువ జనసమూహాలు, వ్యాపార సముదాయాలు ఉన్నచోట పెద్ద చెత్తకుండీలు, చెత్త నిండిన వెంటనే తీసుకెళ్లి.. ఖాళీ డస్ట్‌బిన్ ఉంచేలా చర్యలు తీసుకోవాలి. దుకాణాలు మూసేప్పుడు చెత్తను రోడ్డుపై వేయకుండా ఉండేలా నిర్వాహకులు ఆదేశాలు ఇవ్వాలి. మున్సిపాలిటీలకు నిత్యం వేల సంఖ్యలో ప్రజలు వివిధ అవసరాల కోసం రాకపోకలు సాగిస్తుంటారు. పట్టణాల్లో సరైన టాయిలెట్స్, మరుగుదొడ్లు లేకపోవడం వల్ల నిత్యం ఇబ్బందులకు గురవుతుంటారు. పురుషులు ఎక్కడో ఒకచోట బహిరంగ మూత్ర విసర్జన చేస్తున్నారు.

మహిళల పరిస్థితి అయితే చాలా దారుణంగా ఉంటోంది. ఇంటి దగ్గరి నుంచి బయలుదేరి మళ్లీ ఇంటికి వెళ్లే వరకూ ఊపిరి బిగపట్టుకోవాల్సిన పరిస్థితి. పట్టణాల్లోని వ్యాపార సవముదదాయాలు, దుకాణాల్లో కూడా ప్రస్తుతం ఎక్కడా టాయిలెట్స్ సౌకర్యం సరిగ్గా లేదు. వ్యాపార సముదాయాలు ఉన్నవారందరికీ నోటీసులు ఇచ్చి టాయిలెట్స్ నిర్మించుకునేలా వెసులుబాటు కల్పించాలి. అలాగే పే అండ్ యూజ్ పద్ధతిలో సులభ్ కాంప్లెక్స్‌లు నిర్మించాలి. బస్టాండ్‌లలో ప్రస్తుతం టాయిలెట్స్ ఎక్కడా లేవు.. కొత్తగా టాయిలెట్స్ నిర్మించి.. వాటి నిర్వహణ చేసేలా చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా జిల్లాకేంద్రంలో వెంటనే ఈ పనులు చేపట్టాలి. దీనివల్ల బహిరంగ మూత్ర విసర్జన తగ్గిపోతుంది. చెత్త శుద్ధి, డ్రెయినేజీలు శుభ్రం, బహిరంగ మూత్ర విసర్జనను తగ్గించడంతోపాటు మున్సిపాలిటీల్లో మరిన్ని సమస్యలు ప్రధానంగా ఉన్నాయి. గ్రామాల్లో మాదిరిగానే విద్యుత్ సమస్యలు పట్టణాల్లోనూ అధికంగా ఉన్నాయి. కొత్త కాలనీలకు విద్యుత్‌లైన్ల ఏర్పాటు, కేబుల్ తీగలు చుట్టుకుని ప్రమాదకరంగా ఉన్న స్తంభాలు, వేలాడుతున్న తీగలు, దారికి అడ్డంగా ఉన్న స్తంభాలు, ఒకేలైన్‌లో లేని స్తంభాలను సరిచేయాల్సి ఉంటుంది. అలాగే రోడ్ల విస్తరణ జరిగే వరకు ఇప్పటికే ఖాళీ చేసిన శిథిల భవనాలను తొలగించాల్సి ఉంది. పట్టణాల్లో బహిరంగ జంతువధను నిషేధించి.. వధశాలల్లోనే వధించేలా ఏర్పాట్లు చేయాలి. కొన్నిచోట్ల కబేళాలు ఉన్నా పలుచోట్ల బహిరంగ వధ కొనసాగుతూనే ఉంది. బజార్లలోనే మాంసం అమ్మకాలు సాగుతున్నాయి. త్వరలో నిర్వహించబోయే పట్టణ ప్రణాళిక కార్యక్రమంలో కచ్చితమైన ప్రణాళిక రూపొందిస్తే పట్టణాలు బాగుపడటం ఖాయమేనని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. పల్‌ఎలె ప్రగతిలో సానుకూల ఫలితాలు వచ్చాయి. పట్టణ ప్రగతిలో సమస్యలు పరిష్కారమవుతాయని భావిస్తున్నారు. మంచినీటి వసతి, అంతర్గత రహదారులు, మురుగు కాలువలు, క్రీడా ప్రాంగణాలు, ఓపెన్ జిమ్‌లు, సీసీరోడ్లు, వీధిలైట్లు, రోడ్ల విస్తరణ వంటి సమస్యలు పరిష్కారం చేయాలి. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అధికకారులు, ప్రజాప్రతినిధులు కృషిచేస్తే పట్టణ ప్రగతి విజయవంతం అవుతుంది.

యాంత్రీకరణకు పనిముట్లకు నిధుల కొరత

సబ్సిడీ యంత్రాల కోసం రైతుల ఎదురుచూపు

నిజామాబాద్,ఫిబ్రవరి19 (ఆర్ఎన్ఎ):కూలీల కొరత కారణంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని ప్రవేశ పెట్టారు. ఒకప్పుడు దుక్కిదున్నడం మొదలు, నాటు, కలుపు, వరి కోతలు కోయడం, నూర్పిడి చేయడం వంటి పనులన్నీ కూలీల ద్వారానే చేసేవారు. కానీ ఆధునిక యంత్రాల రాకతో అన్నదాతలు వాటికి అలవాటు పడ్డారు. ఆధునిక పనిముట్లు, యంత్రాలను 50 నుంచి 90 శాతం సబ్సిడీపై ఇస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేసే పథకంతో పాటు కేంద్ర ప్రభుత్వం అమలు చేసే ఆర్‌కేవీవై పథకం ద్వారా కూడా సబ్సిడీ ఇస్తున్నది. టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి యాంత్రీకరణ పథకం కింద ట్రాక్టర్లు, మినీ ట్రాక్టర్లు , హార్వెస్టర్లను ఇస్తున్నది. ఎస్సీ, ఎస్టీలకు 90 శాతం, ఇతరులకు 50 శాతం సబ్సిడీ ఇస్తుండడంతో చాలా డిమాండ్ ఏర్పడింది. ప్రస్తుతం వ్యవసాయ కూలీలను వరినాట్లు వేసేం దుకు, కలుపుతీతకు మాత్రమే వినియోగించుకుంటున్నారు. దీనికి తోడు కూలీల రేట్లు కూడా పెరిగిపోవడంతో అధిక మంది రైతులు యంత్రాలపై ఆధారపడుతున్నారు. ఆ యంత్రా ధరలు లక్షల్లో ఉండడంతో వాటిని నేరుగా కొనుగోలు చేసే ఆర్థిక స్థోమత రైతులకు లేకపోవడంతో ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ పై ఆధారపడ్డారు. వ్యవసాయ రంగంలో ప్రతియేటా వస్తున్న విప్లవాత్మక మార్పులకు అనుగుణంగా రైతులు ఆధునిక యంత్రాలు, పనిముట్లను ఉపయోగించి పంటలను సాగు చేసేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన వ్యవసాయ యాంత్రీకరణ పథకం రెండేళ్లుగా అమలుకు నోచుకోవడం లేదు. ప్రతి ఏటా ప్రభుత్వం రైతులకు 50 నుంచి 90 శాతం సబ్సిడీపై యంత్రాలు, పరికరాలను అందజేస్తుం డడంతో రైతులు సాగును కొత్త పుంతలు తొక్కించారు. తక్కువ పెట్టుబడులతో ఎక్కువ దిగుబడులను సాధించారు.ఈ పథకం గత రెండు సంవత్సరాలుగా అమలు కాకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకపోతే వరుసగా ఎన్నికలు రావడంతో కోడ్ అమలులో ఉండడంతో ఆ ఏదాదికి ఒక్క రూపాయి కేటాయించలేదు. 2019-20 ఆర్థిక సంవత్సరానికైనా వ్యవసాయ యాంత్రీకరణకు నిధులు కేటాయిస్తారని రైతులు ఆశించినప్పటికీ, ఇంతవరకు ఆ పథకం ఊసే ఎత్తడం లేదు. మరో నెలరోజులు గడిస్తే ఈ ఆర్థిక సంవత్సరం కూడా ముగియనున్నది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో సాగు విస్తీర్ణం పెరుగుతున్నది. దానికి అనుగుణంగా వరిపొలాలు దున్నేందుకు సరిపడా ట్రాక్టర్లు, వరి నాటు యంత్రాలు, వరి కోసేందుకు హార్వేస్టర్లు, ఇతర పరికరాలు లేకపో వడంతో రైతులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నా రు. పది సంవత్సరాలుగా రైతులు యంత్రాలపైనే ఆధార పడుతున్నారు. అయితే కొన్నిచోట్ల అధికారుల అలసత్వం వల్ల సకాలంలో లబ్దిదారులను ఎంపిక చేయకపోవడంతో నిధులు మురిగిపోయాయని అంటున్నారు. కొన్నిచోట్ల గత రెండేళ్లుగా ఈ పథకం కింద నిధులను కేటాయించక పోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులను కూడా ప్రభుత్వం ఖర్చు చేయక పోవడం గమనార్హం. రెండవసారి అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు కింద గడిచిన ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి కొంత మంది రైతులకు పెట్టుబడి సాయాన్ని అందించలేదు. ప్రస్తుత యాసంగి సీజన్‌కు ఇప్పుడిప్పుడే నిధులను రైతుల ఖాతాల్లో వేస్తున్నారు. అది కూడా అందరికి రావడంలేదు. రుణ మాఫీ సొమ్మును ఇంకా విడుదల చేయలేదు. రుణాలపై జీరో వడ్డీ సొమ్మును విడుదల చేయక పోవడంతో రైతులే ఆ భారాన్ని భరిస్తున్నారు. వ్యవసాయ యాంత్రీకరణ ద్వారా కొంత మేరకు లబ్ది పొందుతామనుకునే రైతుల ఆశలు నెరవేరడం లేదు. వరుస ఎన్నికల వల్ల యాంత్రీకరణ పథకం కింద నిధుల కేటాయించక పోయినా ఎన్నికలు అన్ని పూర్తయినా కూడా ఇప్పటి వరకు ప్రభుత్వం ఆ పథకం ప్రస్తావన తీయడం లేదు. ప్రభుత్వం ఎప్పుడు నిధులు కేటాయిస్తుందా అని రైతులు ఎదురు చూస్తున్నారు. కనీసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆర్‌కేవీవై పథకానికి సంబంధిం చిన కేటాయింపులు చేసినా కొంత మంది రైతులకు లబ్ది చేకూరేది. ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు మరొక నెల రోజులు మాత్రమే ఉండడంతో ఇప్పటికైనా నిధులను కేటాయించి తమకు లబ్ది చేకూర్చాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ప్రమాదాలకు కేంద్రంగా రాజీవ్ రహదారి

తాజాగా అల్గనూరు కాలువతో ప్రమాదాలు

మృత్యుఘోష వినిపిస్తున్నా కానరాని తక్షణ చర్యలు

కరీంనగర్,ఫిబ్రవరి19(ఆర్ఎన్ఎ): రాజీవ్ రహదారి అంటేనే ప్రమాదాలకు నిలయంగా మారింది. రోడ్డు మార్గంలో నిత్యం ప్రమాదాలు సర్వసాధారణంగా మారాయి. ఈ రహదారిని సక్రమంగా మార్చాలని తెలంగాణ ఉద్యమ సమయంలో సిఎం కెసిఆర్, హరీష్ రావులు డిమాండ్ చేయడమే గాకుండా ఆందోళనలు కూడా చేపట్టారు. అయినా అది సాకారం కాలేదు. తాజాగా ఇప్పుడు అలగనూరు కాలువ ప్రమాదాలకు కేంద్రంగా మారింది. అల్గునూర్ వద్ద ఎల్ఎండీ నుంచి వరంగల్ వైపు సాగు నీటి సరఫరాకు నిర్మాణం చేసిన కాకాతీయ కాలువ రాజీవ్‌రహదారి మీదుగా వెళుతుంది. రాజీవ్ రహదారిపై 24 గంటలపాటు వాహనాల రద్దీ ఉంటుంది. ఇటువంటి ప్రమాదకరంగా ఉన్న ప్రాంతంలో రాజీవ్ రహదారిని ఆనుకుని ఉన్న కెనాల్‌కు రక్షణ చర్యలు పటిష్టంగా ఏర్పాటు చేయాల్సి ఉండగా అధి కారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో వాహనదారుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ప్రమాద సంఘటన జరిగిన సమయాల్లో అధికారులు హడావుడి చేసి నియంత్రణ చర్యలు చేపడతామని చెప్పడం మినహా శాశ్వతంగా ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం వ్యవహరిస్తుండడంతో ప్రమాదాలు పునరావృత మవుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. రహదారిపై సాగునీటి కాలువల వద్ద సరైన రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో వరుసగా ప్రమాదాలు జరుగుతు న్నాయి. రాజీవ్‌రహదారిపై అల్గునూర్ వద్ద కాకతీ య కెనాల్ డేంజర్ స్పాట్‌గా మారింది. నెల రోజుల వ్యవధిలో జరిగిన మూడు ప్రమాదాల్లో రెండు కార్లు, ఒక ద్విచక్ర వాహనం కాకతీయ కెనాల్‌లోపడి ఆరుగురి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. కాకతీయ కాలువకు రోడ్డువైపున మాత్రమే వాల్‌ను ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. కరీంనగర్ నుంచి హైదరాబాద్ వైపు వెళుతున్న సమయంలో కెనాల్ వద్ద ఎడమ వైపు కాలువ గట్టుపై మట్టిరోడ్డు సమాంతరంగా ఉన్నది. మట్టిరోడ్డు వైపు కాలువ నుంచి రాజీవ్ రహదారి రోడ్డు మలుపు వద్ద ఎలాంటి గ్రిల్ లేదా గోడ వంటిది ఏర్పాటు చేయకపోడవంతో ఈ స్థలమే డేంజర్ స్పాట్‌గా మారింది. ఇక్కడే జనవరి 25న ఒక వ్యాపారి తన కారును మలుపుతుండగా క్షణంలో కాలువలోకి జారిపోవడంతో దంపతులు దుర్మరణం చెందా రు. అక్కడ చేపల వ్యాపారులు, కొనుగోలుదారులు చూస్తుండగానే వారి కళ్ళేదుటే ఈ ఘోరం జరిగింది. జనవరి 27న మరో కారు ప్రమాదవశాత్తు కాలువలోకి జారి కుటుంబ సభ్యులు ముగ్గురు మృత్యువాత పడ్డారు. ఈ నెల 16న రాత్రి కరీంనగర్ నుంచి గన్నే రువరం కు బైక్‌పై వెళుతున్న సమయంలో బైకు అదుపు తప్పి కాలువలో పడగా భార్య మరణించగా భర్తను పోలీసులు రక్షించారు. ఇలా వరుసగా ప్రమాదాలు జరిగి వాహనదారులు ప్రాణాలు గాలిలో కలుస్తున్నా రాజీవ్‌రహదారి నిర్వహణ సంస్థకాని, ఆర్‌అండ్‌బీ అధికార

మహిళాశక్తికి జేజేలు పలికిన సుప్రీం

తాజా తీర్పుతో కేంద్రం కళ్లు తెరవాలి

వారిపట్ల వివక్షను తొలగించుకోవాలి

న్యూఢిల్లీ,ఫిబ్రవరి19(ఆర్ఎన్ఎ): చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు తప్ప అన్నింటా మహిళలు విజయం సాధిస్తున్నారు. సుప్రీంకోర్టు జోక్యంతో అన్ని రంగాల్లో మహిళలకు విజయం దక్కుతోంది. ఇక చట్టసభలకు సంబంధించి కూడా సుప్రీం ఆదేశిస్తే తప్ప రిజర్వేషన్లు లేదా కోటా దక్కేలా లేదు. తాజాగా ఆర్టీలో మహిళల పట్ల వివక్ష లేకుండా వారికి పదోన్నుతుల్లో పురుషులతో సమానంగా ప్రాధాన్యం ఇవ్వాలని సుప్రీం ఇచ్చిన తీర్పు మహిళా రంగానికి గొప్ప విజయంగా భావించాలి. మహిళల శారీరక పరిస్థితులను సాకుగా చూపి లేదా సామాజిక నియమాలను కారణాలుగా చూపి సైన్యంలో వారిపట్ల వివక్ష అమలు చేయడం తగదని స్పష్టం చేసింది. పురుషులతో సమానంగా వారికి కూడా అన్ని బాధ్యతలనూ అప్పగించాలన్న తొమ్మిదేళ్లనాటి ఢిల్లీ హైకోర్టు తీర్పును అమలు చేయడంలో అలసత్వం ఎందుకని ప్రశ్నించింది. ఈ తీర్పు ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వానికి మాత్రమే కాదు...అంతక్రితం దేశాన్ని పాలించినవారికి కూడా చెంపపెట్టు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం దగ్గరపడుతున్న తరుణంలో సుప్రీంకోర్టు సోమవారం చరిత్రాత్మకమైన తీర్పు వెలువరించింది. మహిళలను కీర్తించవలసి వచ్చేనరికి మనకు ఆది పరాశక్తి గుర్తుకొస్తుంది. వారి గురించి అనేక ఉపమానాలు చెబుతాం. అయినా వీరం వేయాల్సి వస్తే నసుగుతాం. అందుకు చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు గట్టెక్కించకపోవడమే కారణంగా చూడాలి. రణరంగంలో శౌర్యపరాక్రమాలను ప్రదర్శించిన మాంచాల, మల్లమ్మ, ఝాన్సీ లక్ష్మీబాయి, రాణిరుద్రమ వంటి వీరనారులు ఎందరో ఆదర్శంగా నిలిచారు. తీరా సైన్యంలో తీసుకోవాల్సివచ్చేసరికి వారి త్యాగాలు, ధైర్యసాహసాలు కానరావడం లేదు. మహిళలకు తగిన సామర్థ్యం ఉండదని, శారీరకంగా వారు బలహీనులని అనుకుంటాం. వారి ఆదేశాలు పాటించడానికి వారి పరిధిలో పనిచేసే పురుష సైనికులు ఇబ్బందిపడతారని అంటారు. మహిళలకు కీలక బాధ్యతలు అప్పజెప్పడానికి సైన్యం వెనకడుగు వేస్తుంటే,ఆ ధోరణిని మార్చి సరిచే యాల్సిన ప్రభుత్వాలు కూడా అందుకు వత్తాసు పలుకుతున్నాయి. సైన్యంలోకి తమను అనుమతించాలని స్వాతంత్ర్యం వచ్చినప్పటినుంచి మహిళలు డిమాండు చేస్తూనే వున్నారు. కానీ ప్రభుత్వాలు పట్టించు కోవడం లేదు. ఓ తలల్ఇగా ఇంటిని చక్కదిద్దే ధైర్యాన్ని నిర్వహిస్తూ అసమాన శూరులుగా పిల్లలను తీర్చిదిద్దుతున్న తల్లిని శంకించడం అంటే మన తల్లులను అవమానించుకోవడమే అవుతుంది.

రాజ్యాంగం ప్రకారం పౌరులందరూ సమానమేనని, వారికి సమానావకాశాలు లభించి తీరాల్సిందేనని ఢిల్లీ హైకోర్టు తీర్పునిచ్చాక వైమానిక దళం దాన్ని శిరసావహించింది. కానీ నావికా దళం, సైన్యం తమ తప్పు సరిదిద్దు కోలేదు. సైన్యమైతే బాహాటంగా వ్యతిరేకించింది. అప్పట్లో శాశ్వత ప్రాతిపదికన తీసుకోవాల్సిన మహిళా అధికారులు 40మందికి మొండిచేయి చూపింది. దీనిపై వారు మళ్లీ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది. మరోపక్క ఈ తీర్పును వ్యతిరేకిస్తూ కేంద్రం సుప్రీంకోర్టుకెక్కింది. తాజా తీర్పు ఢిల్లీ హైకోర్టు తీర్పునే ధ్రువీకరించింది. సమానత్వానికి జవాబుగా ఉన్న రాజ్యాంగంలోని 14వ అధికరణకు భిన్నంగా వ్యవహరించడం తగదని తాజా తీర్పు ప్రభుత్వానికి స్పష్టం చేసింది. సైన్యంలో వున్నవారు ఎవరైనా తగిన శక్తిసామర్థ్యాలు కలిగివున్నారో లేదో, లక్ష్యాలను పరిపూర్తి చేయగలుగుతున్నారో లేదో చూడాలి. కార్గిల్ యుద్ధ సమయంలో పాకిస్తాన్ సైన్యం దాడులకు దిగినప్పుడు మహిళా సైనికులు ఎక్కడా వెరవలేదు. తక్షణ స్పందనలో పురుష సైనికులకు వారెక్కడా తీసిపోలేదు. సుశిక్షిత సైనికులు తమకు ఆదేశాలిచ్చే అధికారిలో తగిన శక్తిసామర్థ్యాలున్నాయా లేదా, చిత్తశుద్ధి ఉందా లేదా అని చూస్తారు తప్ప ఆడా మగా అని చూడరు. పోలీసు శాఖలో పనిచేస్తున్న మహిళా అధికారులే ఇందుకు నిదర్శనం. ఆ శాఖలో ఎందరో ఐపీఎస్ అధికారులు, ఇతర మహిళా అధికారులు విధి నిర్వహణలో అద్భుతమైన శక్తిసామర్థ్యాలు ప్రదర్శిస్తున్నారు. సంక్షోభాలు, ఉద్రిక్తతలు తలెత్తినప్పుడు సిబ్బందిని మెరుగ్గా నడిపిస్తున్నారు. ప్రజల మన్ననలు అందుకుంటున్నారు. సైన్యంలో అది సాధ్యం కాదని చెప్పడం పురుషాధిపత్య ధోరణులను ప్రోత్సహించడమే అవుతుంది. తాజా తీర్పు పర్యవసానంగా మహిళలు కల్నల్ స్థాయికి, అక్కడినుంచి బ్రిగేడియర్, మేజర్ వగైరా స్థాయిలకు చేరుకుంటారు. అయితే గతంలో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసినవారు యుద్ధరంగంలో అవకాశం ఇవ్వడమనేది విధానపరమైన నిర్ణయం కనుక తాము కోరడం లేదని చెప్పారు. ఇప్పుడు సుప్రీంకోర్టు సైతం ఆ జోలికి పోలేదు. జర్మనీ, నార్వే, అమెరికా వంటి దేశాలు మహిళలను యుద్దాల్లో కూడా భాగస్వాముల్ని చేస్తున్నాయి. ఏదేమైనా ఈ తీర్పు చరిత్రాత్మకమైనది. భవిష్యత్తులో మహిళల రణరంగ ప్రవేశానికి సైతం ఇది బాటలు పరుస్తుందనడటంలో సందేహం లేదు.

1950లో వచ్చిన సైనిక చట్టం సైన్యంలో పరిమితంగా మహిళల సేవలు వినియోగించు కోవచ్చునని చెప్పినా అది సాకారం కావడానికి మరో 42 ఏళు పట్టింది. 1992లో తొలిసారి సైన్యంలో మహిళలకు అవకాశం ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. కానీ అదంతా కాంట్రాక్టు నియామకాలకే పరిమితమైంది. 2006నాటికి స్వల్పకాల సేవల్లో మహిళలను నియమించటం మొదలైంది. ఆ తర్వాత మరో మూడేళ్లకు వైద్య సేవలు, మరికొన్ని ఇతర రంగాల్లో మహిళల శాశ్వత నియామకాలకు ప్రభుత్వం అనుమతి నిచ్చింది. ఈ నియామకాలు కూడా ఆర్మీ ఎడ్యుకేషన్ కోర్, జడ్జి అడ్వొకేట్ జనరల్ బ్రాంచ్ వంటి కొన్ని రంగాలకు మాత్రమే పరిమితమైంది. ఇలా శాశ్వత నియామకాల ద్వారా వచ్చినవారికి 60 ఏళ్ల వయసు వచ్చేవరకూ పనిచేసే అవకాశం లభిస్తుంది. మరోపక్క స్వల్పకాల సేవల కోసం చేరే మహిళలకు అయిదేళ్ల సర్వీసు గడిచాక మరో అయిదేళ్లు మాత్రమే పొడిగింపునకు అవకాశం ఇస్తున్నారు. ఆ తర్వాత కూడా మెరుగ్గా పనిచేస్తున్నారని భావించే మహిళలకు మరో నాలుగేళ్లు అవకాశం ఇచ్చి రిటైర్ చేస్తున్నారు. అంటే, మహిళలను గరిష్టంగా 14 ఏళ్ల తర్వాత రిటైర్ కావాల్సిందే. అదే పురుషులకైతే 14 ఏళ్ల తర్వాత వారు కోరితే మినహాయింపు ఇస్తున్నారు. ఈ పద్ధతిలో చేరినవారికి శాశ్వత నియామకాలకు కూడా అవకాశం లభిస్తోంది. కానీ మహిళలకు అవేమీ లేవు సరికదా... రిటైరైన తర్వాత దక్కే లబ్ది కూడా పురుషులతో పోలిస్తే తక్కువే.

మిర్చి రైతులను వెన్నాడుతున్న కూలీల కొరత

ఇతర రాష్ట్రాల నుంచి కూలీల రాకతో పెరగిన ఖర్చు

తడిసి మోపెడు అవుతోందన్న ఆందోళన

వరంగల్,ఫిబ్రవరి19(ఆర్ఎన్ఎ): మిర్చి రైతులను కూలీల కొరత వేధిస్తోంది. ఓ వైపు పండించిన పంటకు గిట్టుబాటు ధరలు రాక ఆందోళనలు చెందుతుంటే పంట ఏరడానికి కూలీల సమస్య తీవ్రంగా మారింది.

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గత కొన్ని రోజులుగా మిర్చీ కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ క్రమంలో స్థానికంగా కూలీలు దొరుకకపోవడంతో రైతులు ప్రత్యామ్నాయ మార్గాలు వెతుకుతున్నారు. ఖర్చు భారమైనా ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు వెళ్లి కూలీలను తీసుకొస్తున్నారు. వరంగల్, ఖమ్మం ఉమ్మడి రెండు జిల్లాలో ఇతర రాష్ట్రాలకు చెందిన కూలీలు సుమారు 25 వేల మందికి పైగానే పని చేస్తున్నారు. ఈ ఏడాది మిర్చీ పైరుపై వైరస్‌ల ప్రభావం ఎక్కువగా ఉండడంతో నివారణకోసం రైతులు భారీగా పెట్టుబడులు పెట్టారు. దాంతో సాగుకే ఖర్చు తడిసి మోపెడైంది. పంట బాగానే పండినా కూలీల కొరతతో సకాలంలో పంటను తీసుకోలేకపోతున్నారు. స్థానికంగా అందుబాటులో లేకపోవడంతో ఇతర రాష్ట్రాలకు వెళ్లి కూలీలను తీసుకొస్తున్నారు. మధ్యప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ లకు చెందిన సుమారు 5 వేల మంది కూలీలు మిర్చీ కోతలు చేపడుతున్నారు. రైతులు వారికి కేజీకి రూ.12నుంచి రూ.15లు చెల్లిస్తున్నారు. క్వింటా మిర్చీ ప్రస్తుతం రూ.12వేలు పలుకుతుండడంతో రైతులు త్వరగా తమ పంటను కోసి విక్రయిం చేందుకు తొందర పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఖర్చు భారమైనా ఇతర ప్రాంతాల నుంచి కూలీలను తీసుకొస్తున్నారు. ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి పంటను పండించిన మిర్చీ రైతులకు స్థానికంగా కూలీలు దొరక్క పోవడంతో పొరుగు రాష్ట్రాలకు ప్రయాణమై వలస కూలీలను మిర్చీ కోతలకు తీసుకు రావడం వారికి అదనపు భారంగా మారింది. పంట పండించడానికి అప్పో సప్పో చేసి రైతులు పెట్టుబడులు పెట్టారు. కానీ చేతి కందిన పంటను కోయించడానికి కూలీలు దొరుకకపోవడంతో నానా ఆగచాట్లు పడాల్సి వస్తోంది. ఈ పరిస్థితిని అధిగ మించడానికి అన్నదాతలు వలస కూలీలపై ఆధారపడక తప్పడం లేదు. దీంతో రైతులకు ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. మిర్చి కోతలకోసం వచ్చే కూలీలు ఖమ్మం జిల్లాతోపాటుగా ఉమ్మడి వరంగల్, నల్లగొండ, వరంగల్ జిల్లాలకు కూడా వెళ్తుంటారు. కాగా.. కొందరు రైతులు తమ పరిచయాల మేరకు నేరుగా ఆయా ప్రాంతాలకు వెళ్లి కూలీలతో మాట్లాడి తీసుకొ స్తున్నారు. ముందుగా అక్కడకు వెళ్లి, అడ్వాన్సు చెల్లించిన వారం రోజుల తర్వాత కూలీలు చెప్పిన ప్రాంతానికి చేరుకుంటున్నారు. మరికొంత మంది రైతులు మాత్రం ఇతర రాష్ట్రాల కూలీలు చేరుకునే భూజీపేట రైల్వే జంక్షన్‌కు వస్తున్నారు. అక్కడ ఒకటి రెండు రాత్రులు బసచేస్తున్నారు. అక్కడ బ్రోకర్లను ఆశ్రయించి ఒక్కో కూలీకి రూ.100కమిషన్ చెల్లించి కూలీలను తీసుకెళ్తున్నట్టు చెబుతున్నారు. కూలీలు దొరకని వారు నిరాశగా వెను దిరుగుతున్నారు. ప్రస్తుతం వాతా వరణంలో మార్పులు రావడం, పలుచోట్ల జల్లులు పడుతుండటంతో అన్నదాతలు పొలంలో కాయలు దెబ్బతింటాయని ఆందోళన చెందుతున్నారు. దీంతో చేసేది లేక మహారాష్ట్రనుంచి కూలీలను తీసు కొచ్చి మిర్చి కోత చేపడుతున్నారు. పొరుగు రాష్ట్రాల కూలీలను రప్పించడం రైతులకు భారంగా మారుతుంది. పంట చేతికందిన సమయంలో గ్రామాలలో కూలీల కొరత తీవ్రంగా ఉంది. దీంతో పొరుగు రాష్ట్రాల కూలీలపైనే ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది.

పర్యటనకు ముందే భారత్‌కు ట్రంప్ షాక్

ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలు ఉండవని ప్రకటన

మరోవైపు ట్రంప్ రాకకోసం భారత్‌లో భారీ ఏర్పాట్లు

న్యూఢిల్లీ,ఫిబ్రవరి19(ఆర్ఎన్ఎ): పర్యటనకు ముందే అమెరికా అధ్యక్షుడు ఇండియాకు షాకిచ్చారు. భారత్ పర్యటన కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను అంటూనే ..ఈ పర్యటనలో ఎలాంటి ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలపై సంతకాలు ఉండవని స్పష్టం చేశారు. భారత్‌తో ట్రేడ్ డీల్స్ కుదుర్చుకోబడి ఉన్నామన్న ఆయన.. అది అధ్యక్ష ఎన్నికల తరువాత ఆలోచిస్తామని తెలిపారు. మోడీతో మా మైత్రి చిరకాలం కొనసాగుతుందని చెప్పారు. ఇదిలా ఉంటే మరో నాలుగు రోజుల్లో భారత్ రానున్న ట్రంప్ కోసం భారీ ఏర్పాట్లు చేసింది కేంద్రం. ఇటు గుజరాత్ సర్కార్ ట్రంప్ 3గంటల పర్యటన కోసం అహ్మదాబాద్ ను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసింది. వాణిజ్య ఒప్పందంలో భాగంగా అమెరికా అధ్యక్షుడు ఫిబ్రవరి 24న భారత్‌లో అడుగుపెట్టనున్నారు. పర్యటనలో భాగంగా డొనాల్డ్ ట్రంప్ తన సతీమణి మెలానియాతో కలిసి గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో పర్యటించనున్నారు. అమెరికా అధ్యక్షుడు ఎక్కడికి వెళ్ళినా ఎయిర్‌ఫోర్స్ వన్ విమానం ఉపయోగిస్తారు. అందులోనే ట్రంప్ దంపతులు భారత్ పర్యటనకు రానున్నారు. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా వారు ఈ విమానంలోనే వెళ్తుంటారు. ప్రస్తుతం అమెరికా అధ్యక్షుని ఎయిర్ ఫోర్స్ వన్ ఇది వరకు పనిచేసిన అధ్యక్షుల విమానాలతో పోలిస్తే ప్రస్తుతం ఎయిర్ ఫోర్స్ వన్ బోయింగ్ 747-200 విమానం అత్యంత శక్తివంతమైనది. అతి పెద్ద అధ్యక్ష విమానం కూడా ఇదే. అధ్యక్షులుగా ఉండే వారు ప్రయాణాలకు వినియోగించే విమానాలలో లాంగ్ రేంజ్ గల విమానం ఇది. అమెరికా అధ్యక్షుడు ఉండే భవనం శ్వేత సౌధం అయితే.. ప్రయాణించే ఎయిర్ ఫోర్స్ వన్ విమానం ఎగిరే శ్వేత సౌధంగా చెప్పవచ్చు. ఇందులోని సౌకర్యాలను ఒకసారి పరిశీలిస్తే.. గగనతలంలో ఇంధనం నింపే సౌకర్యం కలదు. 4,000 చదరపు అడుగుల విస్తీర్ణం గల ఫ్లోర్ స్పేస్ ఉంటుంది. దీనిని మూడు భాగాలుగా విభజించి కాన్ఫరెన్స్ హాల్, డైనింగ్ రూమ్, అధ్యక్షుడు, అతని సతీమణికి ప్రత్యేక గదులు, సీనియర్ స్టాఫ్‌కు ప్రత్యేక గదులు, వైద్య అవసరాల నిమిత్తం ప్రత్యేక గది, అధ్యక్షుడి సలహాదారులకు, ఎయిర్ ఫోర్స్ వన్ ఉద్యోగులకు, మీడియాకు ఇలా వేరువేరు గదులు ఉంటాయి. ఒకేసారి 100 మంది భోజనం చేసే విధంగా ప్రత్యేక డైనింగ్ సదుపాయం కలదు. భద్రత విషయానికొస్తే అధునాతన సెక్యూరిటీ టెక్నాలజీ దీని సొంతం.

హాల్ శాటిలైట్ కమ్యూనికేషన్ కోసం మల్టీ ఫ్రీక్వెన్సీ రేడియో వ్యవస్థ కలదు. ఎయిర్‌ఫోర్స్ వన్‌పై దాడులు జరిగితే మొబైల్ కమాండ్ సెంటర్‌గా పనిచేస్తుంది. హాల్ శాటిలైట్ కమ్యూనికేషన్ కోసం మల్టీ ఫ్రీక్వెన్సీ రేడియోలు కలవు. ఇది టేకాఫ్ తీసుకునేటపుడు ఇది మోయగలిగే బరువు 8,33,000 పౌండ్లు ఉంటుంది. అమెరికా అధ్యక్షుడు ఉండే భవనం శ్వేత సౌధం అయితే.. ప్రయాణించే ఎయిర్ ఫోర్స్ వన్ విమానం ఎగిరే శ్వేత సౌధంగా చెప్పవచ్చు.

తిరుపతి కరకంబాడి ప్రాంతంలోఅక్రమంగా తరలిస్తున్న ఎర్రదొంగలను అరెస్ట్ చేసి దుంగలను స్వాధీనం చేసుకున్న పోలీసులు.

ఆసియా రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్

రెజ్లింగ్‌లో సునీల్‌కు కాంస్యం

న్యూఢిల్లీ,ఫిబ్రవరి19(ఆర్ఎన్ఎ): ఆసియా రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత మల్లయోధుడు సునీల్ కుమార్ సుదీర్ఘ నిరీక్షణకు తెరదించాడు.

గ్రీకో రోమన్ 87 కేజీల విభాగంలో స్వర్ణం గెలిచిన సునీల్.. 27 ఏళ్ల తర్వాత ఈ కేటగిరిలో పసిడి గెలిచిన భారత రెజ్లర్‌గా నిలిచాడు. 1993లో చివరిగా పప్పూ యాదవ్ ఆసియా ఛాంపియన్‌షిప్‌లో గ్రీకో రోమన్‌లో స్వర్ణం గెలిచాడు. అటు ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్లో సునీల్ 5-0తో కిర్గిస్థాన్ రెజ్లర్ అజత్ చిత్తు చేశాడు. అంతకుముందు సెమీస్‌లో ఈ భారత రెజ్లర్ 11-8తో కజకిస్థాన్ రెజ్లర్ అజ్మత్ పై విజయం సాధించాడు. ఒక దశలో 1-8తో వెనకబడిన సునీల్ వరుసగా 11 పాయింట్లు సాధించి నెగ్గడం విశేషం. ఇదే టోర్నీలో మరో భారత రెజ్లర్ అర్జున్ 55 కేజీల విభాగంలో కాంస్యం గెలిచాడు.

మన పట్టణాలను మనమే మార్చుకుందాం

ఆ బాధ్యత స్థానిక ప్రజాప్రతినిధులదే

డంబాచారాలు వద్దు....ప్లానింగ్‌తో పనిచేయాలి

ఫోటోలకు పోజులిచ్చే కార్యక్రమం పోవాలి

ప్రజలతో కలసి పనిచేసే అలవాటు చేసుకోవాలి

24 నుంచి 10 రోజుల పాటు పట్టణప్రగతి కార్యక్రమం

రాష్ట్ర స్థాయి మున్సిపల్ సమ్మేళనంలో సీఎం కేసీఆర్

హైదరాబాద్,ఫిబ్రవరి19(ఆర్ఎన్ఎ): తెలంగాణలోని అన్ని పట్టణాలు, నగరాలను దేశంలోకెల్లా ఆదర్శ పట్టణాలుగా మార్చే గురుతర బాధ్యత కొత్తగా ఎన్నికైన మేయర్లు, చైర్ పర్సన్లు, కౌన్సిలర్లు, కార్పొరేటర్ల పై ఉందని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అన్నారు. మంగళవారం ప్రగతి భవన్ లో జరిగిన రాష్ట్ర స్థాయి మున్సిపల్ సమ్మేళనంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజాప్రతినిధులకు కర్తవ్యబోధ చేశారు.

మున్సిపల్ చైర్మన్లు, మేయర్లకు సీఎం కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ నెల 24 నుంచి 10 రోజుల పాటు పట్టణప్రగతి కార్యక్రమం చేపట్టాలని అధికారులకు సీఎం ఆదేశించారు. రాజకీయ నాయకుల ప్రవర్తన ఎలా ఉండాలో సోదాహరణంగా వివరిస్తూ, చివరికి భర్తృహరి సుభాషిత పద్యం చదివి, అర్థం చెప్పి కార్యోన్ముఖులను చేశారు. మీ కర్తవ్యాన్ని నిర్వహించడంలో మీరు విజయాన్ని సాధించాలి. ప్రజా జీవితంలో అనేక రకాల అనుభవాలుంటాయి. దేశంలో, రాష్ట్రంలో ప్రస్తుతమున్న పరిస్థితుల్లో రాజకీయాలు చాలా సులభం అయిపోయాయి. ఒకప్పుడు రాజకీయాలంటే కష్టంతో, త్యాగంతో కూడుకున్నటువంటివి. బ్రిటిష్ వారి వలస పాలన తర్వాత స్వతంత్ర భారతంలో సౌకర్యవంతమైన రాజకీయాలు వచ్చాయి. అప్పట్లో ఆత్మార్పణ, త్యాగం అయితే నేడు స్వేచ్ఛా భారతంలో ఉన్నాము. జాతి నిర్మాణ రంగంలో మనమంతా మమేకమైపోయాము. దీన్ని గుర్తెరిగి పనిచేసే వారికి మంచి పేరు వస్తుంది. ప్రజా నాయకులుగా ఎదిగితే, అది జీవితానికి మంచి సాఫల్యం. అధికారం, హోదా వచ్చినాక మనిషి మారకూడదు. లేని గొప్పతనాన్ని, ఆడంబరాన్ని తెచ్చుకోవద్దు. ఐదు కోట్ల మందిలో 140 మందికే మేయర్లు, చైర్ పర్సన్లు అయ్యే అవకాశం వచ్చింది. దీన్ని ఒక ముందడుగు స్వీకరించి, సానుకూలంగా మార్చుకోగలిగితే ప్రజా జీవితంలో ఎంత ముందుకైనా పోవచ్చు. అది మీ చేతుల్లోనే ఉంది. విధి నిర్వహణలో విఫలం కావద్దు. పదవి అసిధారావ్రతం (కత్తిమీద సాము) లాంటిది. ప్రజా జీవితం అంత సులభం కాదు. సోయి తప్పి పని చేయవద్దు. చాలా కష్టపడి రాష్ట్రం తెచ్చుకున్నాం. మన రాష్ట్రం వస్తే మనం బాగుపడతామని ప్రబలంగా పోరాడాం. ప్రజలు నన్ను రెండు సార్లు సిఎం చేశారు. నా వరకైతే గెలిచేంత వరకే రాజకీయం, తర్వాత కాదు. ప్రభుత్వ పథకాల అమలు చూస్తే అది అర్థం అవుతుంది. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ లాంటి పథకాలు అన్ని గ్రామాల్లో వివక్ష లేకుండా అమలు చేసాం. ప్రజలంతా మనవాళ్లే అనుకున్నాం. ఏ పని చేయాలన్నా తదేక దీక్షతో చేయాలి. చాలా మందికి ఆత్మవిశ్వాసం తక్కువ ఉంటుంది. అలా ఉండకూడదు. అవగాహనతో అర్థం చేసుకుని, చేయాలని అనుకుంటేనే బాధ్యత తీసుకోవాలి. పట్టుదల ఉంటేనే విజయం సాధిస్తారు. మీ మీద ప్రజలకు నమ్మకం కలగాలి. అలా ఒక్కసారి నాయకుడి మీద విశ్వాసం కలిగితే, ప్రజలు సంపూర్ణంగా సహకరిస్తారు. ప్రజాశక్తిని మనం సమీకృతం చేయగలిగితే మనం గొప్ప ఫలితాలు సాధిస్తాం. ఇప్పుడు ఎన్నికైన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులే రేపటి నాయకులు అవుతారు. మీరంతా ధీరులు కావాలి. సంకల్పం గట్టిగా ఉంటే వందశాతం విజయం సాధిస్తారని ముఖ్యమంత్రి చెప్పారు. మున్సిపాలిటీ అంటేనే మురికికి, చెత్తకు పర్యాయపదంగా మారింది. అవినీతికి మారుపేరు అయింది. బల్దియా .. ఖాయా పీయా చల్దియా అనే సామెతలు వచ్చాయి. ఆ చెడ్డ పేరు పోవాలంటే పారదర్శకమైన విధానాలు అవలంభించాలి. అవినీతి రహిత వ్యవస్థ ఉండాలి. పట్టణ ప్రగతి ప్రణాళికా బద్ధంగా ఉండాలి, అడ్డదిడ్డంగా ఎటుపడితే అటు కాదు. అది మీ చేతుల్లో ఉందని ముఖ్యమంత్రి చెప్పారు. ప్రజాప్రతినిధులు డంబాచారాలు పలకవద్దు. అన్ని పనులు ఓవర్ నైట్ లో చేసేస్తాం అని మాట్లాడవద్దు. ఏం చేయాలనే విషయంలో పక్కా ప్లానింగ్ వేసుకోవాలి. మంచి అవగాహన ఏర్పరచుకోవాలి. సమగ్ర కార్యాచరణను రచించుకుని రంగంలోకి దిగాలి. అందరినీ కలుపుకుని పోయి, ప్రజల భాగస్వామ్యంతో అనుకున్న విధంగా పట్టణాలను తీర్చిదిద్దాలి. ఫోటోలకు ఫోజులివ్వడం తగ్గించి, పనులు చేయించడంపై ఎక్కువ దృష్టి పెట్టాలి. సరిగ్గా అనుకుని ఆరు నెలలు కష్టపడితే పట్టణాలు మంచి దారి పడతాయి. ప్రగతి నిరోధక శక్తులు ఎప్పుడూ ప్రతిబంధకంగా ఉంటూనే ఉంటాయి. వాటిని అధిగమించాలి. ప్రగతికాముకంగా ముందుకు సాగాలి. ఎప్పుడూ ఇతర దేశాల విజయగాథలు వినడమే కాదు. మనమూ విజయం సాధించాలి. మన పట్టణాలను మనమే మార్చుకోవాలని ముఖ్యమంత్రి చెప్పారు. చివరిగా ముఖ్యమంత్రి కేసీఆర్ ఏనుగు లక్ష్మణకవి రాసిన పద్యాన్ని చదివారు. మేయర్ల, చైర్ పర్సన్లు, అధికారులు అనుకున్న లక్ష్యం సాధించి, ఉత్తములుగా నిలవాలని ఆకాంక్షించారు.

పోలీస్‌స్టేషన్ల పరిపాలన అధికారుల సమావేశం



కరీంనగర్, ఫిబ్రవరి 19(నేటినిజం ప్రతినిది):కరీంనగర్ కమీషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్‌స్టేషన్లకు చెందిన పరిపాలన అధికారుల సమావేశం బుధవారం నాడు కమీషనరేట్ కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా సిటి స్పెషల్‌బ్రాంచి ఇన్స్‌పెక్టర్ ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌లోని వివిధ విభాగాల పనితీరును పర్యవేక్షించడంలో పరిపాలన అధికారుల పాత్ర కీలకమైందన్నారు. నమోదుకాబడిన కేసులకు సంబంధించిన వివరాలను వెంటనే అప్‌లోడ్ చేయించాలని పేర్కొన్నారు. ప్రతి ఫిర్యాదు విషయాలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారం విషయంలో సున్నితంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజలకు సత్వరం సేవలందించడమే లక్ష్యంగా పోలీసులు ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. వివిధ రకాల సమస్యలతో పోలీస్‌స్టేషన్‌లకు వచ్చే ప్రజలను వివిధ రకాల కారణాలతో తిప్పిపంపకుండా వారికి కనీస మర్యాదనిచ్చి ఫిర్యాదులను స్వీకరించాలన్నారు. ఫిర్యాదుదారులకు సంబంధించిన ఫోన్‌నెంబర్లను తీసుకోవాలని తెలిపారు. మహిళలు,విద్యార్థినులకు సంబంధించిన ఫిర్యాదుల విషయంలో సత్వరం స్పందించి విచారణ జరుపాలని చెప్పారు. పెద్దశిక్షలు పడే కేసుల్లో కొన్ని చిన్నచిన్న పొరపాట్లద్వారా నిందితులు శిక్షింపబడలేకపోతున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలు కేసులను ఉదహరించారు. ప్రస్తుతం పోలీస్‌శాఖలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం పెరిగిందని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై పట్టుసాధించాలని పిలుపునిచ్చారు. పోలీస్‌స్టేషన్లకు చెందిన పరిపాలన అధికారులు పోలీస్‌స్టేషన్‌లోని వివిధ విభాగాల పనితీరుపై స్పష్టమైన అవగాహన కలిగిఉండాలని సూచించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం ద్వారానే మెరుగైన సేవలందించవచ్చున్న విషయాన్ని గుర్తించాలన్నారు. ఏదైనా సమాచారం అందించే వారిపేర్లను గోప్యంగా ఉంచుతామని తెలుపాలని చెప్పారు. పోలీస్‌స్టేషన్లలోని వివిధ విభాగాలు సమిష్టిగా పనిచేయడం ద్వారా కేసుల పరిష్కారమార్గాలు లభిస్తాయని గుర్తించాలని తెలిపారు. . ఈ సమావేశంలో ఐటిసెల్ ఇన్స్‌పెక్టర్ సతేష్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై కత్తితో దాడిఎంజిఎంకు తరలింపు

వరంగల్ రూరల్,ఫిబ్రవరి19 (ఆర్ఎన్ఎ): పట్టపగలు ఓ యువకుడిపై కత్తి దాడి జరిగిన ఘటనవరంగల్ రూరల్ జిల్లా నర్సంపేట పట్టణంలోని పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో జరిగింది. నర్సంపేటకు చెందిన ఇంజాపూర్ సృజన్ అనే యువకుడికి దేవేందర్ అనే యువకుడికి మధ్య ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలో సృజన్‌పై దేవేందర్ కత్తితో దాడి చేశాడు. సృజన్ పరిస్థితి విషమంగా ఉండటంతో పోలీసులు ఆయనను చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలిం చారు. ఘటనపై పోలీసులు విచారిస్తున్నారు.

పెన్షన్ నిలిపివేత: గుండెపోటుతో వృద్ధుడు మృతి

అనంతపురం,ఫిబ్రవరి19(ఆర్ఎన్ఎ): ప్రభుత్వం పెన్షన్‌ను నిలిపివేయడం కారణంగా తీవ్ర మనోవ్యథకు గురైన వృద్ధుడు గుండెపోటుతో మృతి చెందాడు. అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణంలో హుస్సేన్ పీరా(65) అనే వృద్ధుడికి రెండు నెలలుగా పెన్షన్‌ను ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో తీవ్ర మనస్థాపానికి గురై హుస్సేన్ మృతి చెందాడని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. గతంలో పెన్షన్ రెగ్యులర్‌గా వచ్చేదని, ఇటీవలే నిలిపివేయడంతో తీవ్రావేదనకు గురయ్యాడని వారు తెలిపారు.

వైభవంగా శ్రీవారి లక్ష్మీకాసులహారం శోభాయాత్ర

కల్యాణవెంకన్నకు బంగారు తిరుక్కోరము, వజ్రాల భావలీలు బహూకరణ

తిరుపతి,ఫిబ్రవరి18(ఆర్ఎన్ఎ): తిరుమల శ్రీవారి లక్ష్మీకాసులహారం శోభాయాత్ర మంగళవారం వైభవంగా జరిగింది. తిరుపతిలోని టిటిడి పరిపాలనా భవనం ను

మోహినీ అవతారంలో జగన్మోహనాకారుడు

తిరుపతి,ఫిబ్రవరి18(ఆర్ఎన్ఎ): శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో ఐదో రోజైన మంగళవారం ఉదయం శ్రీనివాసుడు మోహినీ అవతారంలో పల్లకీలో, తిరుచ్చిపై చిన్ని కృష్ణుడు ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. ఉదయం స్వామివారు నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పల్లకీ ముందు గజరాజులు ఠీవిగా నడుస్తుండగా, భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, కేరళ కళాకారుల వాయద్యాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఉత్సవం కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. మోహినీ అవతారమాయా మోహ నాశనం బ్రహ్మోత్సవాలలో ఐదో రోజు ఉదయం సకల లోక కల్యాణకారకుడు అయిన శ్రీ కల్యాణ వేంకటేశ్వరుడు దివ్యమోహినీ రూపంలో ఉత్సవమూర్తియై, తిరుచ్చిపై చిన్న కృష్ణుడు భక్తులను తన కృపాకటాక్షాలతో అనుగ్రహించారు. ఆ దివ్య మోహినీ మాయాశక్తికి వశమైన జగత్తు వాహ్య వాహకభేదాన్ని గుర్తుంచుకోలేక పోయింది. కనుక శ్రీవారు జగన్మోహినియై పల్లకీలో కూర్చొని ఉంటారు. ఈనాటి శ్రీవారి మోహినీ అవతారం భౌతికంగా జగన్మోహకత్వాన్నీ, ఆధ్యాత్మికంగా మాయాతీతశుద్ధ సత్త్వస్వరూప సాక్షాత్కారాన్ని ఏక సమయంలోనే సిద్ధింపజేస్తుంది. పౌరాణిక నేపథ్యంలో 108 వైష్ణవ దివ్యదేశాలలోనూ, శ్రీవారి బ్రహ్మోత్సవాలలో గరుడ వాహనోత్సవం అతి ముఖ్యమైనది. గరుడ వాహనంపై ఉన్న శ్రీవారిని దర్శిస్తే మోక్షం సిద్ధిస్తుందని భక్తుల నమ్మకం. వేదాలు, ఆచార్యులు గరుడుడిని వేదస్వరూపుడిగా పేర్కొన్నారు. గరుత్మంతుని రెక్కలు వేదం నిత్యత్వానికి, అపౌరుషేయత్వానికి ప్రతీకలని స్తుతించారు. గరుడుని సేవాదృక్పథం, మాతృభక్తి, ప్రభుభక్తి, సత్యనిష్ఠ, నిష్కళంకత, ఉపకారగుణం సమాజానికి స్ఫూర్తిదాయకాలు. ఇందుకే గరుడసేవకు ఎనలేని ప్రచారం, ప్రభావం విశిష్టత ఏర్పడ్డాయి. ఈ కార్యక్రమంలో టిటిడి ఆలయ డెప్యూటీ ఈవో ఎల్లప్ప, ఏఈవో ధనంజయుడు, సూపరింటెండెంట్ చెంగల్రాయులు, ప్రధాన అర్చకులు బాలాజీ రంగాచార్యులు, టెంపుల్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్, ఆలయ అర్చకులు, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు

కల్యాణ వెంకటేశ్వరుడికి సారె

సంప్రదాయరీతిలో సమర్పించిన చెవిరెడ్డి

తిరుపతి,ఫిబ్రవరి18(ఆర్ఎన్ఎ): శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారికి మంగళవారం మధ్యాహ్నం టిటిడి బోర్డు సభ్యులు, చంద్రగిరి ఎమ్మెల్యే డా. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సారె సమర్పించారు. ముందుగా తిరుపతి సమీపంలోని తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తరువాత శేషవస్త్రాలు, పసుపు కుంకుమ తదితర మంగళద్రవ్యాలతో కూడిన సారెను వేళతాళాల మధ్య ఊరేగింపుగా శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయానికి తీసుకెళ్ళి స్వామివారికి సమర్పించారు. ఈ సందర్భంగా డా. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నట్లు తెలిపారు. ప్రతి ఏటా బ్రహ్మోత్సవాలలో భాగంగా గరుడసేవనాడు స్వామివారికి సారె సమర్పించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఇందులో భాగంగా మంగళవారం స్వామివారికి సమర్పించినట్లు తెలిపారు. ముందుగా ఆలయం వద్దకు చేరుకున్నదా. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి టిటిడి తిరుపతి జెఈవో పి.బసంత్‌కుమార్ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఆలయ డెప్యూటీ ఈవో ఎల్లప్ప, ఏఈవో ధనంజయుడు, సూపరింటెండెంట్ చెంగల్రాయులు, ప్రధాన అర్చకులు బాలాజీ రంగాచార్యులు, టెంపుల్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్, ఆలయ అర్చకులు, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భారత్‌తో వాణిజ్య ఒప్పందంపై ట్రంప్ ప్రకటన

వాషింగ్టన్, ఫిబ్రవరి 19: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ నెల 24, 25 తేదీల్లో భారత్‌లో పర్యటించనున్న విషయం విదితమే. ఈ పర్యటనలో భాగంగా భారత్, అమెరికా దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం చేసుకోవచ్చు అని అందరూ భావించారు. కానీ ఈ ఒప్పందం ఇప్పట్లో లేకపోవచ్చు. భారత్‌తో వాణిజ్య ఒప్పందంపై ట్రంప్ కీలక ప్రకటన చేశారు. భారత్‌తో పెద్ద ఒప్పందాన్ని ఆదా చేస్తున్నానని డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లోపు ఒప్పందం కుదురుతుందో లేదో తెలియదని వ్యాఖ్యానించారు. వాణిజ్య అంశాల్లో భారత్ తమతో సరిగ్గా వ్యవహరించడం లేదని వెల్లడించారు. ముస్ముందు అయితే భారత్‌తో భారీ వాణిజ్య ఒప్పందం తప్పక ఉంటుందని ట్రంప్ స్పష్టం చేశారు. అయితే అమెరికా వాణిజ్య ప్రతినిధి లైట్‌హైజర్.. భారత్‌తో వాణిజ్య చర్చలు జరిపారు. ట్రంప్ పర్యటన బృందంలో లైట్‌హైజర్ లేరని తెలుస్తోంది. లైట్‌హైజర్ లేకపోవచ్చన్న వార్తలు.. ఒప్పందం ఇప్పట్లో కుదిరే అవకాశం లేదన్న ట్రంప్ వ్యాఖ్యలకు బలం చేకూరుస్తోంది. ప్రధాని మోదీ అంటే తనకెంతో ఇష్టమని ట్రంప్ తెలిపారు. ఎయిర్‌పోర్టు, స్టేడియానికి మధ్య 70 లక్షల మంది స్వాగతం పలికేందుకు సిద్ధంగా ఉన్నారని మోదీ తనతో చెప్పడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందని ట్రంప్ పేర్కొన్నారు. అహ్మదాబాద్‌లో ట్రంప్ పర్యటించనున్నారు. సబర్మతిలోని గాంధీ ఆశ్రమాన్ని కూడా ట్రంప్ సందర్శించే అవకాశం ఉంది.

ఈ నెల 24న భారత్ రానున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కోసం గుజరాత్ ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేస్తోంది. ఢిల్లీ నుంచి అహ్మదాబాద్ చేరుకోనున్న ఆయన అక్కడ మూడు గంటలు గడపనున్నారు. దీంతో ట్రంప్ 3గంటల పర్యటన కోసం విజయ్ రూపాణి సర్కార్ రూ. 100కోట్లు వెచ్చిస్తోంది. అహ్మదాబాద్ నగర పాలక సంస్థ, అహ్మదాబాద్ పట్టణాభివృద్ధి సంస్థ సంయుక్తంగా ఈ ఖర్చులను భరిస్తున్నాయి. కేంద్రం మరో రూ. 14కోట్లు అందజేయనుంది. కొత్త రోడ్ల ఏర్పాటు, రోడ్ల మరమ్మతుకు రూ. 80 కోట్లు కేటాయించగా.. పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇక ట్రంప్ భద్రతకు రూ. 12 కోట్ల నుంచి రూ. 15 కోట్ల దాకా వెచ్చిస్తున్నారు అధికారులు. మోడీ, ట్రంప్ రోడ్ షో వెంబడి సాంస్కృతిక కార్యక్రమాలకు మరో రూ. 4 కోట్లు ఖర్చు చేస్తున్నారు. రోడ్ షోకు సుమారు 10 వేల మంది పోలీసులతో భద్రత ఏర్పాట్లు చేస్తున్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు సరైన గౌరవం దక్కుతుందా..?

ఆలోచింపజేస్తున్న రతన్ టాటా వీడియో

ముంబయి,ఫిబ్రవరి18(ఆర్ఎన్ఎ): చెత్తను చేతులతో ఎత్తుతారు వారు.. మన ఆరోగ్యం కోసం వారి ప్రాణాలను పణంగా పెడతారు.. అలాంటి వారికి మన దేశంలో సరైన గౌరవం దక్కుతుందా..? కనీసం వారి పనిని గుర్తించే గొప్ప మనసు మనకుందా..? ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్ టాటా షేర్ చేసిన తాజా వీడియో మనలో ఇలాంటి ప్రశ్నలే రేకెత్తిస్తోంది. పారిశుద్ధ్య కార్మికుల గురించి ఆలోచింపజేస్తోంది. ఇంతకీ ఆ వీడియో ఏంటీ.. ఎందుకు పోస్ట్ చేశారు..?పారిశుద్ధ్య కార్మికుల కోసం 'మిషన్ గరిమా' పేరుతో టాటా ట్రస్ట్ ఓ సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా రతన్ టాటా తన ఇన్‌స్టాగ్రామ్‌లో పారిశుద్ధ్య కార్మికులపై ఓ భావోద్వేగ యాడ్‌ను పోస్ట్ చేశారు. ఇందులో ఓ విద్యార్థి స్కూల్ పోటీల్లో భాగంగా తన తండ్రి గురించి ప్రసంగిస్తాడు. 'మా నాన్న ఈ దేశాన్ని నడిపిస్తాడు. ఆయన రాజకీయ నాయకుడు కాదు. డాక్టర్ కాదు. పోలీస్ కాదు. కనీసం జవాన్ కూడా కాదు. కానీ ఆయన లేకపోతే దేశం ఆగిపోతుంది. మా నాన్న ఒక్క రోజు పనికి వెళ్లకపోయినా ప్రతి ఇంట్లో పనులు ఆగిపోతాయి. ఏ తండ్రి చేయని పని మా నాన్న చేస్తున్నారు. ఈ దేశంలో ఒక్కరు కూడా తడి, పొడి చెత్తను వేరు చేయట్లేదు. అందువల్ల మా నాన్న లోతైన మ్యాన్‌హోల్‌లోకి దిగి వాటిని బయటకు తీయాల్సి వస్తోంది. రోగాలను కూడా పట్టించుకోకుండా ఈ పనిచేస్తున్నారు. కొన్ని సార్లు ఈ రోగాల వల్ల మా నాన్న తిరిగి ప్రాణాలతో ఇంటికి వస్తారో లేదో అని మేం భయపడుతూనే ఉంటాం' అని ఆ బాలుడు చెబుతూ ఉంటే అక్కడున్న అందరి కళ్లు చెమర్చుతాయి.

వీడియోను పోస్ట్ చేస్తూ రతన్ టాటా ఇలా రాసుకొచ్చారు. '2.3 కోట్ల మంది జనాభా ఉన్న ముంబయి మహా నగరంలో 50వేల మంది పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తున్నారు. ముంబయి ప్రజలు వేసే చెత్తను ఏరివేసి నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు వారు ప్రతి రోజు అత్యంత కఠినమైన పరిస్థితుల్లో పనిచేస్తున్నారు. అలాంటి పారిశుద్ధ్య కార్మికులకు సురక్షితమైన, ఆరోగ్యకరమైన పని వాతావరణం కల్పించేందుకు టాటా ట్రస్ట్ 'మిషన్ గరిమా' కార్యక్రమం చేపట్టింది. ఈ కార్యక్రమంలో భాగంగా టూ బిన్స్ లైఫ్‌విన్స్ పేరుతో ఓ క్యాంపెయిన్ ప్రారంభించాం. పారిశుద్ధ్య కార్మికులకు భారం తగ్గించేలా తడి, పొడి చెత్తను వేరు చేద్దాం' అని టాటా పిలుపునిచ్చారు.

కెటిఆర్‌ను ఆకట్టుకున్న టాటా వీడియో

ఈ వీడియో తెలంగాణ రాష్ట్ర మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్‌ను విశేషంగా ఆకట్టుకుంది. మంత్రి కేటీఆర్ ఈ వీడియోను షేర్ చేస్తూ ప్రతిఒక్కరూ చూడాల్సిందిగా కోరారు. వీడియోలో ఓ విద్యార్థి తన తండ్రి పని ప్రాముఖ్యాన్ని ఈ విధంగా తెలియజేస్తుంటాడు. ఎవరి తండ్రి చేయాలనుకోని పనిని మా నాన్న చేస్తాడు అంటూ కొనసాగుతుంది వీడియో. సమస్య తీవ్రతను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం తడి, పొడి చెత్తను వేరుచేసేందుకు చర్యలు, పరిసరాల పరిశుభ్రతకు పెద్దఎత్తున కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. హైదరాబాద్ మహానగరంలో ప్రతిరోజు 4 వేల మెట్రిక్ టన్నుల వ్యర్థపదార్థాలు వస్తున్నట్లుగా సమాచారం. ఎ÷-లాస్టిక్ పదార్థాలతో, తడి, పొడి చెత్త కలయికల వ్యర్థాల తరలింపు అత్యంత సమస్యాత్మకంగా మారింది. దీంతో తడి, పొడి చెత్తను వేరు చేయడం తమ తమ ఇంటి నుండే ప్రారంభం కావాలని పేర్కొంటూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఓ కార్యక్రమాన్ని చేపట్టిన విషయం తెలిసిందే. ఇళ్ల నుండి వచ్చే చెత్తను తడి, పొడి చెత్తగా వేరు చేయడానికి ప్రతీ ఇంటికి రెండు డస్ట్‌బిన్‌లను అందజేసింది. అదేవిధంగా తడి, పొడి చెత్త వేర్వేరుగా చేయడానికి అవగాహన నిమిత్తం స్వచ్ఛ వాలంటీర్లను ఏర్పాటు చేసింది.

డిఫెన్స్ సంస్థకు పారికర్ పేరు

న్యూఢిల్లీ,ఫిబ్రవరి18(ఆర్ఎన్ఎ): ఢిల్లీలోని డిఫెన్స్ స్టడీస్ అండ్ అనాలసిస్ సంస్థ పేరును మార్చారు. ఆ ఇన్స్టిట్యూట్‌కు మాజీ కేంద్ర మంత్రి మనోహర్ పారికర్ పేరును పెట్టారు. ఇక నుంచి ఆ సంస్థను పారికర్ ఇన్స్టిట్యూట్‌గా పిలువనున్నారు. ఇన్స్టిట్యూట్ ఫర్ డిఫెన్స్ స్టడీస్ అండ్ అనాలసిస్ సంస్థ కేంద్ర రక్షణశాఖ ఆధ్వర్యంలో నడుస్తుంది. ఇక నుంచి ఆ సంస్థను మనోహర్ పారికర్ ఇన్స్టిట్యూట్ ఫర్ డిఫెన్స్ స్టడీస్ అండ్ అనాలసిస్ అని పిలుస్తారు. పారికర్ సేవలను గుర్తించి, ఆయనకు తగిన గౌరవాన్ని ఇస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొన్నది.

భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై నీలి నీడలు

ట్రంప్ వ్యాఖ్యలతో గందరగోళం

వాషింగ్టన్,ఫిబ్రవరి19(ఆర్ఎన్ఎ): భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం ఆశలపై నీలి నీడలు కమ్ముకొంటున్నాయి. ఇప్పట్లో ఇది కుదిరే అవకాశం లేదన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ చేసిన వ్యాఖ్యలే ఇందుకు కారణం. 'భారత్‌తో ఒప్పందం చేసుకోవచ్చు. అయితే, ఎన్నికలకు ముందే ఇది జరుగుతుందా లేదా అనేది చెప్పలేను. కానీ, మరింత విస్తృతమైన ఒప్పందం కోసం ప్రస్తుతానికి దీన్ని పక్కనబెడుతున్నాం' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఫిబ్రవరి 24న ట్రంప్ భారత్‌కు రానున్నారు. ఈ పర్యటనలోనే ఒప్పందంపై సంతకాలు జరిగే అవకాశం ఉందని అంతా భావించారు. అ దిశగా చర్చలు కూడా జరిగినట్లు ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న అధికారులు తెలిపారు. కానీ, ట్రంప్ వ్యాఖ్యలతో వాటిపై సందేహాలు నెలకొన్నాయి. మరోవైపు, భారత్‌కు రానున్న ట్రంప్ బృందంలో అమెరికా వాణిజ్య ప్రతినిధి లైట్‌హైజర్ ఉండే అవకాశం లేదని అక్కడి అధికారి ఒకరు తెలిపారు. అయితే దీన్ని ఇంకా ధ్రువీకరించాల్సి ఉంది. లైట్‌హైజర్ నేతృత్వంలోనే భారత్‌తో అమెరికా వాణిజ్య చర్చలు జరిపింది. తాజాగా ఆయన పర్యటన బృందంలో లేకపోవచ్చన్న వార్తలు.. ఒప్పందం ఇప్పట్లో కుదిరే అవకాశం లేదన్న ట్రంప్ వ్యాఖ్యలకు బలం చేకూరుస్తోంది.

సందర్భంగా ట్రంప్ మరోసారి భారత్‌తో వాణిజ్య సంబంధాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వాణిజ్యం విషయంలో అమెరికాకు భారత్ సరైన ప్రాధాన్యం ఇవ్వడం లేదంటూనే ప్రధాని మోదీతో ఉన్న మైత్రిని మరోసారి గుర్తుచేసుకున్నారు. విమానాశ్రయం, స్టేడియానికి మధ్య 70 లక్షల మంది స్వాగతం పలికేందుకు సిద్ధంగా ఉన్నారని మోదీ తనతో చెప్పారని ట్రంప్ మరోసారి ప్రస్తావించారు.

రోమైవు పూర్తిస్థాయి ఒప్పందం కుదరకపోయినప్పటికీ.. పాక్షిక ఒప్పందం మైవు మొగ్గుచూపే అవకాశం ఉందని మరికొంత మంది అధికారులు అభిప్రాయపడటం గమనార్హం. ఇటీవల ఇరు దేశాలు పెంచిన టారీఫ్‌లే ఒప్పందం ఖరారులో చిక్కుముడిగా మారినట్లు తెలుస్తోంది. స్టెంట్‌ల వంటి వైద్యపరికరాలకు భారత విపణిని మరింత సరళతరం చేయాలని అమెరికా కోరుతోంది. ఈ తరుణంలో తాజా బ్జడెట్‌లో వైద్యపరికరాల దిగుమతిపై సుంకాన్ని భారత్ మరింత పెంచింది. దీనిపై అగ్రరాజ్యం అసంతృప్తిగా ఉన్నట్లు సమాచారం. మరోవైపు స్టీల్, అల్యూమినియం దిగుమతులపై అమెరికా కూడా టారీఫ్‌లను పెంచింది. దీంతో భారత్ కూడా అసహనం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో ఒప్పందం ఖరారు వాయిదా పడినట్లు సమాచారం.

దివ్య మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి

హంతకులను కఠినంగా శిక్షించాలన్న తండ్రి

సిద్దిపేట,ఫిబ్రవరి19(ఆర్ఎన్ఎ): మంగళవారం హత్యకు గురైన బ్యాంకు ఉద్యోగిని దివ్య (26)మృతదేహానికి గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం పూర్తిచేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని దివ్య తండ్రి లక్ష్మీరాజ్యం డిమాండ్ చేసారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటకు చెందిన దివ్య (26)ను గజ్వేల్‌లో లక్ష్మీప్రసన్న కాలనీలోని తన ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు గొంతు కోసి దారుణంగా హత్య చేసిన విషయం తెలిసిందే. ఎల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన న్యాలకంటి లక్ష్మీరాజ్యం, మణెమ్మ దపంతుల కూతురు దివ్య (26) కొంత కాలంగా స్థానిక ఏపీ జీవీబీ బ్యాంకులో విధులు నిర్వహిస్తున్నది. తల్లిదండ్రులతో కలిసి దివ్య పట్టణంలోని లక్ష్మీప్రసన్నకాలనీలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నది. మంగళవారం సాయంత్రం విధులు ముగించుకొని తన నివాసానికి వెళ్లింది. అయితే, రాత్రి సమయంలో దివ్య ఒంటరిగా ఉండడం చూసి గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి వెంట కొసి హత్య చేసి పారిపోయారు. విషయం తెలుసుకున్న ఏసీపీ నారాయణ ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. క్లూస్ టీం సిబ్బంది వివరాలు సేకరిస్తున్నారు. కాగా, దివ్య వివాహం ఈ నెల చివరి వారంలో జరుగనుందని స్థానికులు తెలిపారు. ఇంతలోనే దివ్య హత్యకు గురవడంతో కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. మరో వారంలో వివాహం జరుగాల్సిన అమ్మాయి రక్తపుమడుగులో ఉండడాన్ని చూసి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. హత్య కు సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది.

అదుపులోకి వచ్చిన మంటలు

15గంటలు శ్రమించిన ఫైర్ సిబ్బంది

ముంబయి,ఫిబ్రవరి19(ఆర్ఎన్ఎ): ముంబయి సమీపంలోని డాంబివిలీలో చోటుచేసుకున్న భారీ అగ్నిప్రమాదంలో చెలరేగిన మంటలు.. 15 గంటల అనంతరం బుధవారం తెల్లవారుజామున అదుపులోకి వచ్చాయి. ఇక్కడి 'మెట్రోపాలిటన్ ఎగ్జిమ్‌కెమ్ ప్రైవేట్ లిమిటెడ్' అనే రసాయన కర్మాగారంలో మంగళవారం మధ్యాహ్నం మంటలు చెలరేగాయి. కర్మాగారంలోని రసాయనాల కారణంగా వందకు పైగా భారీ పేలుళ్లు సంభవించాయి. ఈ కర్మాగారానికి వెనుక ఉన్న మరో ఫ్యాక్టరీకి మంటలు విస్తరించాయి.

ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా అధికారులు ఘటనా స్థలానికి 500 మీటర్ల పరిధిలో ఉన్న కార్యాలయాలు, విద్యాలయాలను ఖాళీ చేయించారు. సమీపంలోని మాత్రే పడా ప్రాంతంలో నివసిస్తున్న సుమారు 150 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. "మంటలను ఈ ఉదయం నాలుగు గంటలకు ఆర్పివేశాం. ఈ ఘటనలో ప్రాణనష్టం సంభవించలేదు. అయితే ఈ ప్రాంతమంతా దట్టమైన పొగతో నిండి ఉంది. ఈ కర్మాగారానికి అగ్నిమాపక శాఖ అనుమతులు ఉన్నాయా? లేవా? అనే విషయంపై విచారణ చేస్తాం" అని అధికారులు వివరించారు.

పిఆర్సీ నివేదిక గడువు డిసెంబర్ 31 వరకు పొడగింపు

మండిపడుతున్న ఉద్యోగ సంఘాల నేతలు

హైదరాబాద్,ఫిబ్రవరి19(ఆర్ఎన్ఎ): ఉద్యోగస్థులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న పదకొండవ పీఆర్సీ గడువును మరోమారు పొడిగించారు. ప్రభుత్వం మంగళవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. జులై ఒకటి, 2018 నుండి అమలు చేయాల్సిన పీఆర్సీని... నివేదిక ఇంకా రాని నేపథ్యంలో... గడువును డిసెంబర్ 2020 వరకు పొడగించారు. దీనిపై ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌టీయూఎఫ్) తీవ్రంగా ఖండించింది.

జూన్ 2, 2018 నుండి మధ్యంతర భృతి(ఐఆర్) ఇస్తామని, 2018 ఆగస్టు 15 న పిఆర్సీ ప్రకటిస్తామని ముఖ్యమంత్రి స్వయంగా ప్రకటించి, ఇరవై నెలలు గడుస్తున్నా అమలుకు నోచుకోలేదని టీఎస్‌టీయూఎఫ్ ధ్వజమెత్తింది. ఇవ్వాళ, రేపు అంటూ ప్రకటనలకే నేతలు పరిమితమవుతున్నారని టీఎస్‌టీయూఎఫ్ నేతలు చావా రవి తదితరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పీఆర్సీ అమలు జాప్యంపై ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్రమైన అసంతృప్తి తో ఉన్నారని వెల్లడించారు. వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఫిట్‌మెంట్‌ను 45 శాతంతో తక్షణమే ప్రకటించాలని కోరారు. ఇక ఉపాధ్యాయ సంఘాలన్నీ ఇప్పటికైనా ఐక్యంగా ఉద్యమించి, ప్రభుత్వం నుంచి న్యాయమైన పీఆర్సీతోపాటు సీఎం ఇచ్చిన ఇతర హామీల అమలు కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఇక పీఆర్సీ గడువు పెంపుపై టీ పీసీసీ తీవ్రంగా మండిపడింది. 'భజన సంఘాల నేతల్లారా ? నిద్రపోతున్నారా ? చేవ చచ్చిందా ? అంటూ టీ పీసీసీ అధికార ప్రతినిధి, టీ పీఆర్టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు జి. హర్షవర్ధన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నిత్యం సీఎం కేసీఆర్ భజనలు, పాలాభిషేకం చేస్తూ, కేలండర్లు, డైరీల్లో వారి ఫోటోలను పెట్టుకుంటున్న టీజీఓ, టీఎన్జీఓలు సహా కొన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఏం చేస్తున్నారని హర్షవర్ధన్ రెడ్డి నిలదీశారు. ఇప్పటికైనా ఉద్యమానికి సిద్ధం కావాలని హితవు పలికారు. పీఆర్సీలపై ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలంగాణ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పద్మాచారి అన్నారు. ఇప్పటికే రెండు పీఆర్సీలు కోల్పోయామని తెలిపారు. తెలంగాణ కోసం కష్టపడి పనిచేస్తున్నాం..కొత్త జిల్లాల్లో స్టాఫ్ లేకున్నా పని ఎక్కువైనా విధులు నిర్వహిస్తున్నామన్నారు. అన్ని సంక్షేమ కార్యక్రమాలు అద్భుతంగా సాగుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇవ్వాల్సింది ఉద్యోగుల పీఆర్సీ మాత్రమే...సీఎం కేసీఆర్ పిలిచి పీఆర్సీ ఇస్తారని ఆశిస్తున్నామని చెప్పారు.

పౌరసత్వ చట్టంపై ఉద్ధవ్‌ది సొంత అభిప్రాయమే

సిఎఎను ఎన్‌సిపి వ్యతిరేకిస్తోందన్న పవార్

ముంబై,ఫిబ్రవరి18(ఆర్ఎన్ఎ): పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) అమలైనా ఎవరూ ఆందోళన పడాల్సిన పని లేదంటూ మహారాష్ట్ర ముఖ్యమంత్రి, శివసేన చీఫ్ ఉద్ధవ్ థాక్రే చెప్పడంపై ఎన్‌సీపీ చీఫ్ శరద్ పవార్ స్పందించారు. తన అభిప్రాయాన్ని చెప్పే హక్కు శివసేన చీఫ్‌కు ఉందని, దీనిపై భాగస్వామ్య పార్టీలు చర్చించే అవకాశం ఉందని అన్నారు. మంగళవారంనాడిక్కడ మీడియాతో పవార్ మాట్లాడుతూ, పౌరసత్వ సవరణ చట్టాన్ని ఎన్‌సీపీ వ్యతిరేకిస్తోందని, దానిపై చాలా స్పష్టమైన వైఖరితో తమ పార్టీ ఉందని చెప్పారు. ఉద్ధవ్ థాకరే ఏదైతో చెప్పారో, అది ఆయన అభిప్రాయం. ఆయన మహారాష్ట్ర ముఖ్యమంత్రి. ఆయనకు సొంత అభిప్రాయాలుంటాయి. మహారాష్ట్రలో సంకీర్ణ ప్రభుత్వం ఉంది, కొన్ని అంశాలపై భిన్నాభిప్రాయాలు ఉండొచ్చు. సీఏఏకు సంబంధించినంత వరకూ దీనిపై కూర్చుని చర్చించాల్సి ఉంటుంది' అని పవార్ అన్నారు. దీనిపై త్వరలోనే సమగ్ర చర్చ జరిపి, ఉద్ధవ్ థాకరేకు నచ్చజెప్పే ప్రయత్నం చేస్తామని తెలిపారు. దీనికి ముందు, ఉద్ధవ్ థాకరే మాట్లాడుతూ, సీఏఏకు, జాతీయ పౌరుల పట్టిక (ఎన్ఆర్‌సీ)కు తేడా ఉందన్నారు. ఎన్ఆర్‌సీని తన ప్రభుత్వం వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. సీఏఏ అమలైనా ఎవరూ ఆందోళనకు గురికావలసిన అవసరం లేదన్నారు. ఎన్ఆర్‌సీ లేదని, దీనిని రాష్ట్రంలో అమలు చేసేది లేదని చెప్పారు.

అధ్యక్ష ఎన్నికల్లో గెలిస్తే బ్లూమ్‌బర్గ్ అమ్మేస్తా

డెమోక్రటిక్ అభ్యర్థి మైకేల్ బ్లూమ్‌బర్గ్

వాషింగ్టన్,ఫిబ్రవరి19(ఆర్ఎన్ఎ): డెమోక్రటిక్ పార్టీ తరఫున అమెరికా అధ్యక్ష పదవికి పోటీ చేస్తున్న వ్యాపార దిగ్గజం మైఖేల్ బ్లూమ్‌బర్గ్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. నవంబరులో జరిగే అధ్యక్ష ఎన్నికల్లో తాను విజయం సాధిస్తే తనను ధనవంతుడిని చేసిన బ్లూమ్‌బర్గ్ ఎల్‌పీ సంస్థను అమ్మేస్తానని ప్రకటించారు. ఈ మేరకు ఆయన ముఖ్య సలహాదారుడు టిమ్ ఓబ్రెయిన్ ఈ విషయాన్ని ధ్రువీకరించారు. అయితే దీన్ని విదేశీ వ్యక్తులు, ప్రైవేట్ ఈక్విటీ సంస్థలకు అమ్మకూడదని నిర్ణయించుకున్నట్లు టిమ్ తెలిపారు. డొనాల్డ్ ట్రంప్‌లా ఆర్థికపరమైన వివాదాల్లో చిక్కుకోకుండా వాటికి వీలైనంత దూరంగా ఉండేందుకే సంస్థను అమ్మనున్నట్లు మీడియా సమావేశంలో వెల్లడించారు.

÷పబ్లికన్ అభ్యర్థి, ప్రస్తుత అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో తలపడే డెమోక్రటిక్ అభ్యర్థి కోసం జరిగిన ముందస్తు పోల్స్‌లో మైఖేల్ బ్లూమ్‌బర్గ్ అనూహ్యంగా ముందుకొచ్చారు. ఆయన బుధవారం లాస్ వేగాస్‌లో తన తొలి డిబేట్‌లో పాల్గొన్నారు. నవంబరు 3న అమెరికా అధ్యక్ష పదవి కోసం ఎన్నికలు జరగనున్నాయి. మైఖేల్ గతంలో న్యూయార్క్ మేయర్‌గా పనిచేశారు. 1981లో బ్లూమ్‌బర్గ్ ఈ సంస్థను స్థాపించారు. 2019లో ఈ సంస్థ 10 బిలియన్ డాలర్ల నంపదను సృష్టించిందని అంతర్జాతీయ కన్సల్టింగ్ సంస్థలు అంచనా వేశాయి.

పౌరసత్వాన్ని వ్యతిరేకిస్తూ ముస్లింల ర్యాలీ

చెన్నై,ఫిబ్రవరి19(ఆర్ఎన్ఎ): పౌరసత్వ సవరణ చట్టం, ఎన్